ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

కాకినాడ

జిల్లా వార్తలు

మంగళవారం 4 నవంబరు 2025 | 5





పుష్కరఘాట్‌లో మహిళల కార్తీక దీపారాధన



## చేర నీ పాద దీపం..

తూర్పుగోదావరి జిల్లా కడియపులంకలో కార్తీక సోమవారం పర్వదినాన కోటి దీపోత్సవం నిర్వహించారు. శివపార్వతుల శాంతి కల్యాణం, ఆంజనేయస్వామి నక్షత్ర పూజలు వైభవోపేతంగా జరిగాయి. వేదమంత్రాల మధ్య శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి ఆంజనేయస్వామి ఆలయ కమిటీ అధ్యక్షుడు పల్ల సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో అఖండ దీపారాధనను ప్రారంభించారు. - కడియం



జాంపేట శివయ్య

పుష్కరఘాట్‌లో భక్తజనం

## కాపాడు.. కార్తీక దామోదరా..

పవిత్ర గోదావరి తీరం హరహర మహాదేవ శంభో శంకరా అంటూ దేవదేవుడి నామస్మరణతో మార్మోగింది. కార్తీక మాసం సోమవారం మహాశివుడికి అత్యంత ప్రీతికరమైన రోజు కావడంతో భక్తులు వేకువజామున రెండుగంటల నుంచే కోటిలింగాల రేవు, చింతాలమ్మఘాట్,పుష్కరాల రేవు, సరస్వతి ఘాట్, గౌతమి ఘాట్లలో కార్తీక స్నానమాచరించి దీపాలు నదిలో వదిలారు. కాపాడు కార్తీక దామోదరా అంటూ వేడుకున్నారు. - రాజమహేంద్రవరం సిటీ

## ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 571 అర్జీలు

కలెక్టరేట్ (కాకినాడ), నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కాకినాడ కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 571 అర్జీలు వచ్చాయి. హౌసింగ్ పీడీ సత్యనారాయణ, సీపీవో త్రినాథ్, కాకినాడ జీజీహెచ్ పరిపాలనాధికారి శ్రీధర్, సమగ్ర శిక్షా ఏపీసీ వేణుగోపాలరావు, కేఆర్‌ఆర్‌సీ ఎస్డీసీ రత్నమణి, డీపీవో రవికుమార్ అర్జీలు స్వీకరించారు. ప్రధానంగా బియ్యం కార్డుల మంజూరు, కార్డుల్లో పేర్ల మార్పులు-చేర్పులు, పింఛన్లు, ఉద్యోగ ఉపాధి అవకాశాలు, ఇళ్ల స్థలాలు, భూమి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు, రీసర్వే, ఆక్రమణల తొలగింపు, కాలువల్లో పూడికల తొలగింపు, పారిశుధ్యం, ఆటోడ్రైవర్ల సేవలో... వంటి అంశాలపై ప్రజలు అర్జీలు అందజేశారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు హాజరుకాలేని వారు తమ అర్జీలను మీకోసం వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని అధికారులు సూచించారు. కలెక్టరేట్‌లోని వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో వృద్ధురాలు ఇచ్చిన అర్జీ స్వీకరించి పరిశీలిస్తున్న సీపీవో త్రినాథ్

## శిశు మరణాలపై డీఐవో సమీక్ష

జీజీహెచ్ (కాకినాడ), నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో జరిగిన శిశు మరణాలకు గల కారణాలను విశ్లేషిస్తూ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయ సమావేశ మందిరంలో డీఐవో డాక్టర్ కేవీ సుబ్బరాజు ఆధ్వర్యంలో సోమవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనన సమయంలో ఊపిరాడకపోవడం, బిడ్డ తల్లికి పాలు ఇచ్చే ప్రక్రియ సరిగా లేకపోవడం వలన పాలు ఊపిరితిత్తుల్లోకి వెళ్లి శ్వాస ఆడక బిడ్డ మరణించడం, నెలలు నిండని శిశువు జన్మించడం, తక్కువ బరువుతో బిడ్డ జన్మించడం వంటి కారణాలను గుర్తించామన్నారు. ముఖ్యంగా గర్భిణుల్లో రక్తహీనత లేకుండా చూసుకోవడం, ఇనుము, ఫోలిక్ యాసిడ్ సప్లిమెంట్లు తీసుకోవడం, ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్న గర్భిణులను ముందుగా గుర్తించి వారిపై ప్రత్యేక శ్రద్ధ వహించి ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలయ్యేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ప్రసవానంతర సేవలను కచ్చితంగా అమలు చేయాలని, 6 హెచ్‌బీఎస్‌సీ గృహ సందర్శనలు తప్పనిసరిగా చేయాలన్నారు. శిశువు పుట్టిన మొదటి ఆరు నెలల వరకు తల్లి పాలు మాత్రమే ఇవ్వాలని, అవి శిశువుకు అవసరమైన పోషకాలు అందిస్తాయని, ముఖ్యంగా ఇన్‌ఫెక్షన్ల నుంచి రక్షణ కల్పిస్తాయన్నారు. జిల్లావ్యాప్తంగా ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో జరిగిన 48 శిశు మరణాలకు గల కారణాలను విశ్లేషించారు. ఇక ముందు మరణాల సంఖ్య తగ్గించేందుకు మరింత బాధ్యత వహించి ప్రతి ఆరోగ్య కేంద్రం పరిధిలోని గ్రామాల్లో శిశు మరణాలు జరగకుండా అవగాహన సదస్సులు నిర్వహించాలని ఆరోగ్య సిబ్బందిని కోరారు. క్షేత్రస్థాయి నుంచి సిబ్బంది అందరూ శిశు మరణాలను తగ్గించే దిశగా పని చేయాలన్నారు. వివిధ శాఖల సమన్వయంతో నూటికి నూరు శాతం సాధించాలని ఆదేశించారు.

సమావేశంలో కమిటీ సభ్యులు డాక్టర్ జాన్‌విల్సన్, జీజీహెచ్ పిడియాట్రిక్స్ వైద్య నిపుణుడు డాక్టర్ బుర్రి రాంబాబు, డాక్టర్ అలీషా, డాక్టర్ సురేష్‌కుమార్, డాక్టర్ స్వాతి, డాక్టర్ సుబ్రహ్మణ్యం, ఐసీడీఎస్ సీడీపీవో ఎ.జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బందితో సమీక్షిస్తున్న డీఐవో సుబ్బరాజు



అక్రమంగా సాగినా : నాడు పోలవరం కాలువ గట్టు వద్ద మట్టి తరలింపు(ఫైల్)

# మట్టి పెట్టేశారు!

## కొండలు కరిగాయ్

- ఉమ్మడి జిల్లాలో పోలవరం మట్టిని మింగేశారు
- రూ.350 కోట్లకుపైగా మట్టి మాయం
- కోట్లు వెనకేసుకున్న వైసీపీ నేతలు
- ప్రభుత్వం మారి ఏడాదిన్నర
- అక్రమార్కులపై ఇంతవరకూ చర్యల్లేవు
- తాజాగా రూ.300 కోట్లు మట్టి దోపిడీ
- పశ్చిమ,కృష్ణా జిల్లాల్లో అధికారుల నిర్ధారణ



(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

ఒకటి కాదు రెండు కాదు కాదు..ఏకంగా రూ.350 కోట్లు.. గత ప్రభుత్వ హయాంలో ఉమ్మడి జిల్లాలో కొందరు వైసీపీ నేతలు కొల్లగొట్టేసిన పోలవరం మట్టి విలువ ఇది.. అధికారం అండతో అనుమతుల్లేకుండా రియల్ ఎస్టేట్, ఇళ్ల స్థలాల చదునుకు అడ్డగోలుగా విక్రయించి సంపాదించింది అంతకుమించే. ఈ మట్టిని బొక్కేసిన అక్రమార్కులపై ఇప్పటికీ కనీస చర్యలు లేకపోవడం విస్మయపరుస్తోంది. ప్రభుత్వం మారిన వెంటనే దీనిపై విచారణ జరుగుతుందని భావిస్తే ఇంతవరకు ఆ ఊసే లేదు. ఒకరకంగా చెప్పాలంటే అప్పటి మట్టి అక్రమాలను మట్టుపెట్టేశారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. తాజాగా ఉమ్మడి పశ్చిమ, కృష్ణా జిల్లాల్లో వైసీపీ హయాంలో పోలవరం మట్టి అక్రమ తవ్వకాలు రూ.300 కోట్లు అని నిర్ధారణ అయిన నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో చోటుచేసుకున్న రూ.350 కోట్ల అక్రమ తవ్వకాల సంగతేంటనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి.

కాకినాడ, తూర్పు గోదావరి జిల్లాల పరిధిలో పోలవరం ఎడమ ప్రధాన కాలువ వందల కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. సీతానగరం మండలం పురుషోత్తపట్నం దగ్గర మొదలయ్యే ఈ కాలువ గోకవరం, కోరుకొండ, రాజానగరం, గండేపల్లి, ప్రత్తిపాడు, జగ్గంపేట, గొల్లప్రోలు, శంఖవరం, తొండంగి, తుని మండలాల మీదుగా పయనిస్తోంది. గత టీడీపీ ప్రభుత్వంలో ఈ కాలువను 18 మీటర్ల లోతు వరకు తవ్వారు. దీంతో దాదాపు నాలుగు కోట్ల క్యూబిక్ మీటర్ల మట్టి వచ్చింది. కాలువ వెంబడి భూముల్లో 15 అడుగుల ఎత్తు వరకు మట్టి మేటలు వేశారు. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చాక క్రమేపీ ఆ మట్టి కొండలు కరిగిపోతూ వచ్చాయి. అప్పటి అధికార పార్టీ ఎమ్మెల్యేలు, ఇతర నేతలు ఈ మట్టిపై వాలిపోయారు. ప్రధానంగా రాజానగరం, ప్రత్తిపాడు, పిఠాపురం, తుని నియోజకవర్గాల పరిధిలో పోలవరం మట్టిని వైసీపీ ఐదేళ్లలో వేలాది టిప్పర్లలో తరలించేశారు. టిప్పర్ మట్టిని రూ.8 వేలకు కాకినాడ, రూ.12 వేలకు తాళ్లరేవు, యానాం, రూ.4వేలకు పిఠాపురం, రూ.15 వేలకు కోనసీమలో అనేక రియల్‌ఎస్టేట్ స్థలాల చదునుకు విక్రయించి కోట్లు గడించేశారు. ప్రత్తిపాడు,పిఠాపురం నియోజకవర్గాల పరిధిలో చెందుర్తి జాతీయరహదారి పక్కనే పోలవరం కాలువ వెంబడి కోటిన్నర లక్షల క్యూబిక్‌మీటర్ల మట్టి మేటలు, తునిలో 70 లక్షలకుపైగా క్యూబిక్‌మీటర్ల మట్టి నిల్వలను కాజేశారు. దీన్నంతటినీ అప్పట్లో ముగ్గురు ఎమ్మెల్యేలు తమ అనుచరుల ద్వారా యథేచ్ఛగా తరలించుకుపోయారు.

### అనుమతుల్లేకుండా మింగుడు..

నిబంధనల ప్రకారం పోలవరం కాలువ మట్టిని తవ్వాలంటే జలవనరులశాఖ అనుమతి తీసుకోవాలి. కానీ గత వైసీపీ ప్రభుత్వంలో అనుమతుల్లేకుండానే మట్టి కొండలు కొల్లగొట్టారు.గనులు, జలవనరులశాఖ అధికారులు కమీషన్లు పుచ్చుకుని కళ్లు మూసుకోవడంతో పోలవరం మట్టి 95 శాతానికి పైగా మాయమైపోయింది. ఒక ప్పుడు భారీ మేటలున్న ప్రాంతాల్లో ఇప్పుడు ఖాళీ స్థలాలు కనిపిస్తున్నాయి. తూర్పుగోదావరి, కాకినాడ జిల్లాల్లో ఆరున్నర కోట్ల క్యూబిక్ మీటర్ల మట్టి మాయమైపోయింది. పిఠాపురం నియోజకవర్గం యు.కొత్తపల్లి మండలం కొమరిగిరిలో 350 ఎకరాల్లో అప్పటి సీఎం జగన్ చేతుల మీదుగా 2021 డిసెంబర్ 25న పేదలకు ఇళ్లస్థలాలు పంచారు. ఈ భూములు సముద్రానికి అతిసమీపంలో లోతట్టులో ఉన్నాయి. ఈ లేఅవుట్‌ను లక్షల క్యూబిక్ మీటర్ల మట్టితో చదును చేశారు. ఇందుకోసం గొల్లప్రోలు మండలం చెందుర్తి జాతీయరహదారిని ఆనుకుని ఉన్న పోలవరం కాలువ మట్టిని అప్పటి కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి వేలాది టిప్పర్లలో తరలించి కోట్లలో మెక్కేశారు. అప్పట్లో కాకినాడ కీలకనేత ఒక్కరే పోలవరం మట్టిలో రూ.6 కోట్ల వరకు మింగేశారు.

### ఎందుకిలా...

ప్రభుత్వం మారి దాదాపు ఏడాదిన్నరవుతోంది. కానీ ఇంతవరకు పోలవరం మట్టి అక్రమాలపై ప్రభుత్వం కనీసం దృష్టిసారించలేదు. రూ.350 కోట్లకుపైగా విలువైన మట్టిని అప్పటి నేతలు అక్రమంగా అమ్మేసుకున్నా ఇంతవరకు విచారణ చేపట్టకపోవడంతో అక్రమార్కులు దర్జాగా ఉన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరిలో పోలవరం మట్టిని వేలం వేస్తే రూ.350 కోట్ల వరకు రాబట్టవచ్చని 2019లో అధికారులు లెక్కగట్టారు. కానీ అప్పటి ప్రభుత్వం ఈ మట్టంతా తమ పార్టీ నేతలకు దోచిపెట్టింది. పైగా ఈ దోపిడీపై అప్పట్లో ప్రతిపక్ష హోదాలో టీడీపీ పోరాటం చేసింది. ఇప్పుడు చేతిలో అధికారం ఉన్నా కనీసం మట్టి అక్రమాలపై విచారణకు ఆదేశించకపోవడం విమర్శలకు తావిస్తోంది.

### మట్టిలో కలిపేశారా?

కాకినాడ నగరంలో గత వైసీపీ హయాంలో రూ.450 కోట్లకుపైగా విలువైన టీడీఆర్ బాండ్ల జారీపై విజిలెన్స్ నివేదిక సిద్ధమైంది. రేషన్ బియ్యం కుంభకోణంపై సిట్, ఆడుదాం ఆంధ్రా అవినీతిపై విజిలెన్స్ విచారణ చేపట్టింది. పోలవరం మట్టి అక్రమాలపై ఏ విచారణ లేదు. ఉమ్మడి పశ్చిమ, కృష్ణా జిల్లాల్లో 1.21 కోట్ల క్యూబిక్ మీటర్లు రూ.300 కోట్ల విలువైన పోలవరం మట్టి దోపిడీకి గురైందని తాజాగా అక్కడ జలవనరుల శాఖ అధికారులు నిర్ధారించారు. కానీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో రూ.350 కోట్లకుపైగా విలువైన మట్టిని మింగేసిన అక్రమార్కులపై కనీసం అధికారులు కూడా ఉలకడం లేదు. దీంతో పోలవరం మట్టి అక్రమాలను మట్టుపెట్టేశారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.




# సూపర్ మాయ!

## అంతంతమాత్రంగా సూపర్ జీఎస్టీ అమలు

- కానరాని జీఎస్టీ తగ్గింపు
- పాత ధరలకే అమ్మకాలు
- పాత స్టాకు పేరిట దోపిడీ
- మోసపోతున్న కొనుగోలుదారు
- అధికారుల చర్యలు శూన్యం
- ఆన్‌లైన్‌లోనూ అయోమయం

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ నుంచి సామాన్యులకు భారీ ఉపశమనం కలిగించి నెల దాటింది. ఇప్పటికీ సూపర్ జీఎస్టీ ఫలాలు సామాన్యుడికి దక్కడం లేదు. ప్రభుత్వాల ఆదేశాలతో యంత్రాంగం ఓ వారం హడావుడి చేసి చతికిలబడింది. మొన్నటి వరకూ పండుగ ఆఫర్లు అంటూ ఊదరగొట్టిన వ్యాపారులు.. ఇప్పుడు ప్రత్యేక తగ్గింపు అంటూ యథావిధిగా మోసపు ఉదారత చాటుకుంటున్నారు. మరి తగ్గిన జీఎస్టీ ఎంత? అసలు అంతకు ముందు ధర ఎంత? కేంద్ర ప్రభుత్వం తమకు కల్పించిన మేలుతో లాభం ఎంత సమకూరింది? అనే ప్రశ్నలకు సమాధానం ప్రశ్నగానే ఉండి పోతోంది. వ్యాపారులు మాత్రం తమ చాకచక్యాన్ని ప్రజలపై రుద్దుతూనే ఉన్నారు. కేంద్ర ప్రభుత్వం మాత్రం గతంలో ఉన్న ఐదు స్లాబులను రెండుకు తీసుకొచ్చాం..జనానికి భారీగా ఒనగూరుతుందని చెప్పింది. ఈ ధరల మోళీ జీఎస్టీ సూపరట! సేవింగ్స్ ఎక్కడట? అనే సందేహాన్ని నివృత్తి చేయలేక పోతోంది.ఈ గందరగోళం నడుమ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో రోజుకు జనం కోట్లాది రూపాయలు నష్టపోతూనే ఉన్నారు.

### వ్యాపారుల మాయాజాలం..



జీఎస్టీ తగ్గక ముందు ఎంత ధర, తర్వాత ఏ మేరకు తగ్గిందనే విషయాలు దుకాణాల్లో ఎక్కడా కనబడడం లేదు. ఆన్‌లైన్ ప్లాట్‌ఫాంలలో అయితే అంతా అయోమయమే నడుస్తోంది. అసలు ధరను అమాంతం పెంచేసి భారీ తగ్గింపును చూపిస్తుంటారు. ఇప్పుడు కూడా ఆ మాదిరిగానే ధరలు ఉండడంతో జీఎస్టీ వల్ల తమకు ఏమి ఒరిగిందో వినియోగదారుడికి బోధ పడడం లేదు. మొన్నటి వరకూ పండుగ ఆఫర్ల పేరుతో అంతా కలగాపులగం చేసే శారు. జీఎస్టీ తగ్గింపు ఎంత, వ్యాపారి ఇస్తున్న ఆఫర్ ఎంత? అనే వాటిపై స్పష్టత లేకుండాపోయింది. జీఎస్టీని కేంద్ర ప్రభుత్వం భారీగా తగ్గించింది. గతంలో ఐదు స్లాబులుగా ఉన్న పన్నులను 5, 12% రెండు స్లాబులకు తెచ్చింది. దీనిలో కారుల నుంచి బిస్కట్ల వరకూ దాదాపు 375 వస్తువులపై 5 నుంచి 10 శాతం వరకూ పన్నుపోటు తగ్గింది. కొన్నిటికి పన్ను సున్నా చేశారు. అయితే ఆ మేరకు వినియోగదారుడికి ఎంత లబ్ధి చేకూరిందో సూపర్ జీఎస్టీ అమల్లోకి వచ్చి నెల దాటినా స్పష్టత కొరవడింది. ఆన్‌లైన్ ప్లాట్‌ఫాంలలో మరీ దారుణంగా పరిస్థితి నడుస్తోంది. వాస్తవ ధర నిర్ధారణలో స్పష్టత లేకపో వడంతో రూ.5 విలువ చేసే పెన్‌ని రూ.5 వేల ధర చూపించి 99 శాతం డిస్కౌంట్ ఇచ్చేస్తున్నామని రూ.50 ధర పెడుతున్నారు. దీని వల్ల ఇప్పుడు జీఎస్టీ ఎంత తగ్గించారో కూడా తెలియడం లేదు.

### మందుల్లో మోళీ..

ఇవాళ మందుల ఖర్చు చూసి రోగం మరింత ముదిరిపోతోంది. ఓ వైపు అధిక శాతం డాక్టర్లు మందులతో చీటీలను పూర్తిగా నింపేస్తుంటే.. మరోవైపు మందుల దుకాణాల వాళ్లు ఎడాపెడా దోచేస్తున్నారు. చాలా ఆస్పత్రుల్లో సొంత మెడికల్ షాపులు అదనపు వ్యాపారంగా మారిపోయింది. బయట షాపుల్లో ఎమ్మార్పీపై ఏకంగా 20 శాతం వరకూ తగ్గింపు ఇస్తామంటూ వ్యాపారస్తులు పోటీ పడుతుంటారు. ఆస్పత్రుల్లోని మెడికల్ షాపుల్లో ఆ రాయితీ వర్తించడం లేదు. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం మందులపై జీఎస్టీని గణనీయంగా తగ్గించింది. అత్యవసర మందులపై పన్ను ఎత్తేసింది. కానీ ప్రజలకు మాత్రం ఆ మేరకు జేబుకు ఆదా కనబడడం లేదు.ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 3 వేల వరకూ మందుల షాపులు ఉండగా.. 150 వర కూ పెద్ద దుకాణాలు ఉన్నాయి. అత్య వసర మందులతో పాటు సాధారణ మందులను ఒకే చీటీలో రాస్తారు. దీంతో సందట్లో సడేమియా మాదిరిగా అత్యవసర మందులకు జీఎస్టీ తగ్గింపు ఇవ్వడం లేదు.



### అంతా గందరగోళం

దుకాణదారులు జీఎస్టీ మార్పులను అమలు చేయడం లేదు. ఏదో ఒకటి రెండు వస్తువులపై తగ్గింపును చూపుతూ అధిక శాతం వస్తువులపై దోపిడీ సాగుతోంది. కిరాణా తదితర సరుకుల విషయంలో ఇదే నడుస్తోంది. కొందరు వ్యాపారులు పాత స్టాకు, పాత ధరలకే హోల్‌సేల్‌గా కొన్నా మంటూ ధరలు తగ్గించకపోవడం గమనార్హం. సబ్బులు, టూత్‌పేస్ట్, బిస్కట్లు, లేస్, బింగోస్ వంటి వాటి విషయంలో ఎఫ్‌ఎంసీజీ కంపెనీలు ధరలు తగ్గించలేదు. అయితే వీటి పరిమాణాన్ని పెంచామని చెబుతూ గందరగోళానికి తెరలేపుతున్నాయి. పాలు, ఆహార పదార్థాలు, హోటళ్లు, నిత్యావసరాల్లో వేటిపై జీఎస్టీ ఎంత తగ్గిందో ఇప్పటికీ అయోమయంగానే ఉంది. సెప్టెంబరు 22 నుంచి సూపర్ జీఎస్టీ అమల్లోకి రాగా ఓ వారం రోజులు అధికారులు పరుగులు పెట్టారు. తర్వాత యథావిధిగా పట్టు వదిలేశారు.

### జీఎస్టీ తగ్గలేదా.. ఫిర్యాదు చేయండి

జీఎస్టీ అమలుకాని పక్షంలో కొనుగోలుదారుడు ఫిర్యాదు చేసే అవకాశం ఉంది. ఈ విషయం చాలా మందికి తెలియదు. తగ్గిన పన్నుల ప్రకారం ధరలు నిర్ణయించి అమ్మకాలు సాగించకపోతే కొనుగోలుదారుడు నేషనల్ యాంటీ ప్రాఫెటరింగ్ అథారిటీకి ఫిర్యాదు చేయవచ్చు. అయితే ఇలాంటి ఒక సంస్థ ఉందని వందలో ఒక్కరికి కూడా తెలియని పరిస్థితి ఉంది. ఇప్పటికీ దీనిపై యంత్రాంగం అవగాహన కల్పించలేదు. అసలు అధికారుల్లో అధిక శాతం మందికి ఆ సంస్థ గురించి తెలియదు. బిల్లులు ఇవ్వకపోయినా వాణిజ్య పన్నుల శాఖ పట్టించుకున్న దాఖలాలు లేవనే చెప్పవచ్చు. అటు ఔషధ నియంత్రణ శాఖ అసలు ఉందా? అనే తీరు కనబరుస్తోంది.

## బాధితులతో మర్యాదపూర్వకంగా మెలగండి: ఎస్పీ

కాకినాడ క్రైం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత సమస్యలతో పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులతో సిబ్బంది మర్యాదపూర్వకంగా మెలగాలని ఎస్పీ జి.బిందుమాధవ్ ఆదేశించారు. స్థానికంగా పరిష్కారం కాక జిల్లావ్యాప్తంగా 85 మంది అర్జీదారులు సోమవారం ఎస్పీ నిర్వహించిన పోలీస్ గ్రీవెన్స్‌ను ఆశ్రయించారు. అర్జీదారుల సమక్షంలోనే సంబంధిత పోలీస్ అధికారులతో ఎస్పీ వీడియో సమావేశం నిర్వహించారు. వారి ఫిర్యాదులు సమ్మతమైనవైతే వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేసి వేగవంతంగా దర్యాప్తు పూర్తి చేసి సమస్య పరిష్కారానికి త్వరితగతిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గ్రీవెన్స్‌కు వచ్చిన ఫిర్యాదుల్లో 42 భూ తగాదాలు, 24 కుటుంబ కలహాలు, 19 వివిధ కేసులకు సంబంధించినవి వున్నాయి. ఎస్పీ మాట్లాడుతూ ప్రతి ఫిర్యాదును నిశితంగా పరిశీలించి వాస్తవాలు నిర్ధారించగానే చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఏడు రోజుల్లోపు విచారణ పూర్తి చేసి తగిన పరిష్కారం చూపాలన్నారు. చేపట్టిన చర్యల వివరాలను జిల్లా పోలీస్ కార్యాలయానికి సమర్పించాలని అధికారులకు సూచించారు.



అర్జీదారుల గోడు వింటున్న ఎస్పీ బిందుమాధవ్





# తత్త్వణమామి
# సదాశివలింగం


కాకినాడ జిల్లా పిఠాపురం పాదగయ పుష్కరిణిలో కార్తీక దీపం వెలిగించిన భక్తురాలు


కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం దుర్గాడలో ప్రత్యేక అలంకారంలో రామలింగేశ్వరస్వామి


ద్రాక్షారామంలో భీమేశ్వరస్వామికి పంచామృతాభిషేకం


తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం పుష్కర ఘాట్‌లో దీప ప్రజ్వలన చేస్తున్న మహిళ

కార్తీక మాసం రెండో సోమవారం శైవ క్షేత్రాలకు భక్తులు పోటెత్తారు. హరహర మహాదేవ, శంభోశంకర... పాహిమాం, రక్షమాం అంటూ శివనామ స్మరణ చేశారు. తెల్లవారుజామునే ఆలయాలకు వెళ్లి క్యూలైన్లలో బారులు తీరి శివుడిని దర్శించుకుని అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. రాజమహేంద్రవరం పుష్కరాల రేవులో అధిక సంఖ్యలో భక్తులు పుణ్యస్నానాలు ఆరించారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని ప్రముఖ క్షేత్రాలైన పిఠాపురం పాదగయలో కుక్కుటేశ్వరస్వామికి, సామర్లకోట, ద్రాక్షారామల్లో భీమేశ్వరస్వామికి, మురమళ్లలో వీరేశ్వరస్వామికి, కోటిపల్లిలో సోమేశ్వరస్వామికి అర్చకులు పంచామృతాభిషేకాలు, విశేష అర్చనలు జరిపారు.


కాకినాడ జిల్లా పిఠాపురం పాదగయ క్షేత్రంలో కుక్కుటేశ్వరస్వామికి అభిషేకం చేస్తున్న అర్చకులు


డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు విక్రమభట్టేశ్వరస్వామి ఆలయంలో శివలింగానికి అభిషేకం


కాకినాడ జిల్లా సామర్లకోటలో కుమారరామ భీమేశ్వరస్వామికి క్షీరాభిషేకం


కాకినాడ జిల్లా గొల్లప్రోలులో బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన 25 అడుగుల శివలింగం


కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం రాచపల్లిలో అరుణాచలేశ్వరస్వామికి పంచహారతి ఇస్తున్న దృశ్యం


# చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

## కథే ఈ సినిమాకు హీరో


దేవన్


దేవన్ కథానాయకుడిగా నటిస్తూ స్వీయ దర్శకత్వం వహించిన సినిమా 'కృష్ణ లీల'. 'తిరిగొచ్చిన కాలం' అనేది ఉపశీర్షిక. ధన్య బాలకృష్ణన్ హీరోయిన్. జ్యోత్స్న జి నిర్మిస్తున్నారు. ఈ నెల 7న సినిమా విడుదలవుతున్న సందర్భంగా దేవన్ మీడియాతో ముచ్చటించారు. 'ఇదో సూపర్ నేచురల్ లవ్‌స్టోరీ. కొత్తదనంతో నిండిన ఈ కథను నిర్మాతలకు వినిపించగానే ఓకే చేశారు. కృష్ణుడు ఒక ప్రేమ కథలో తన లీలలు ఎలా చూపిస్తారనేది ఆసక్తికరంగా చూపిస్తున్నాం. మనుషులు ఎలాగూ గడిచిపోయిన కాలాన్ని తిరిగి తీసుకురాలేరు. దైవత్వంతో ఆ కాలాన్ని తిరిగి తీసుకురావడమే చిత్ర కథాంశం. కృష్ణతత్వాన్ని అందరికీ మరింత బాగా అర్థమయ్యేలా ఇందులోని సన్నివేశాలు ఉంటాయి. కథే ఈ సినిమాకు హీరో. ప్రేమలోని గొప్పదనాన్ని అందంగా ఆవిష్కరిస్తుంది చిత్రం. భీమ్స్ సిసిరోలియో సంగీతం సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లింది. చిత్రం అన్ని వర్గాల వారినీ మెప్పిస్తుందనే నమ్మకం ఉంది' అని చెప్పారు.

## నటుడిగా యాభై ఏళ్లు.. 22న భారీ వేడుక!




విలక్షణ నటుడు డాక్టర్ మోహన్‌బాబు నటుడిగా పరిచయమై ఈ ఏడాదికి యాభై ఏళ్లు. ఆయన హీరోగా నటించిన తొలి చిత్రం 'స్వర్గం నరకం' 1975 నవంబరు 22న విడుదల అయింది. ఈ అసాధారణ ప్రయాణాన్ని గౌరవించుకునే క్రమంలో ఈ నెల 22న 'ఎంబీ 50.. ఏ పెర్ల్ నైట్ ట్రిబ్యూట్' అనే పేరుతో ఓ భారీ వేడుకను మంచు విష్ణు నిర్వహించనున్నారు. 'దిగ్గజ నటుడిని, భారతీయ సినిమాకు ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకొనేలా ఈ ఈవెంట్ ఉంటుందని మంచు విష్ణు చెప్పారు. ఎలాంటి సినిమా నేపథ్యం లేకపోయినా ఒంటరిగా సినీ ప్రయాణం మొదలు పెట్టి, తనకంటూ ఓ సామ్రాజ్యాన్ని ఏర్పరచుకుని విలక్షణ నటుడిగా ఎదిగిన మోహన్‌బాబు ఎదిగిన జర్నీ గురించి అందరికీ మరోసారి వివరించి చెప్పనున్నారు. ఈ వేడుక పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తామని మంచు విష్ణు చెప్పారు.

## ఉత్తమ నటుడిగా మమ్ముట్టి రికార్డ్!



సోమవారం ప్రకటించిన కేరళ ఫిల్మ్ అవార్డ్స్‌లో మలయాళ చిత్రరంగ సూపర్‌స్టార్ మమ్ముట్టి ఏడోసారి ఉత్తమ నటుడిగా ఎన్నికై అరుదైన రికార్డ్ నెలకొల్పారు. నటుడు ప్రకాశ్‌రాజ్ అధ్యక్షతన ఏర్పాటైన ఏడుగురు సభ్యులున్న జ్యూరీ కమిటీ అవార్డులను ఎంపిక చేసింది. త్రిస్సూర్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో కేరళ మంత్రి షాజీ చెరియన్ అవార్డుల వివరాలు వెల్లడించారు. 'భ్రమయుగం' చిత్రంలో నటించిన మమ్ముట్టి ఉత్తమ నటుడిగా ఎన్నికయ్యారు. ఉత్తమ చిత్రంగా 'మంజుమ్మల్ బాయిస్' ఎన్నికైంది. ఉత్తమ దర్శకుడు అవార్డ్ సహా మొత్తం ఎనిమిది అవార్డులతో ఈ సినిమా సత్తా చాటింది. ఉత్తమ నటుడిగా తను మరోసారి ఎన్నిక కావడంపై మమ్ముట్టి వ్యాఖ్యానిస్తూ 'ఇదో ప్రయాణం.. రకరకాల వ్యక్తులతో కలసి చేసే సుదీర్ఘ ప్రయాణం. ఇక్కడ పోటీ అనే పదానికి తావు లేదు' అని అన్నారు.

## రాకెట్‌కు బాహుబలి పేరు - రాజమౌళి హర్షం



భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ(ఇస్రో) ఇటీవలే ఎల్‌వీఎం3-ఎం5 రాకెట్‌ను విజయవంతంగా ప్రయోగించిన విషయం తెలిసిందే. ఈ రాకెట్‌కు దాని బరువు, సామర్థ్యానికి తగ్గట్టుగా 'బాహుబలి' అనే పేరు పెట్టడంపై దర్శకుడు ఎస్.ఎస్.రాజమౌళి హర్షం వ్యక్తం చేశారు. 'దేశానికి గర్వకారణమైన క్షణం ఇది. మా సినిమా టైటిల్‌తో ఉన్న రాకెట్ ఇంత గొప్ప విజయాన్ని సాధించడం మాకు చాలా ఆనందాన్నిచ్చింది' అని ఇస్రో శాస్త్రవేత్తలను రాజమౌళి అభినందించారు.

## సినిమా టిక్కెట్‌ల వివాదంపై సుప్రీం స్టే

మల్టీప్లెక్స్‌లలోని సినిమా టిక్కెట్‌లకు ఆడిట్ చేసే విధంగా రికార్డులను నిర్వహించాలని కర్ణాటక హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై సుప్రీంకోర్టు స్టే విధించింది. కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఏకరూప టిక్కెట్ విధానాన్ని (రూ.200 + జీఎస్టీ) ప్రశ్నిస్తూ హొంబలె ఫిల్మ్, మల్టీప్లెక్స్‌ల సంఘం హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. దీనిపై హైకోర్టు సింగిల్ జడ్జి మధ్యంతర స్టే ఇచ్చారు. ఈ ఉత్తర్వులకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్‌ను హైకోర్టు డివిజన్ బెంచ్ విచారించింది. సెప్టెంబరు 30న 'ఆడిట్ చేసే విధంగా రికార్డులను నిర్వహించాలి' అని ఆదేశాలు జారీ చేసింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు సోమవారం విచారించింది. జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాతో కూడిన ద్విసభ్య ధర్మాసనం టిక్కెట్ ధరలపై అసంతృప్తిని వ్యక్తం చేసింది. మల్టీప్లెక్స్‌లలో వాటర్ బాటిల్‌కు రూ.100 వసూలు చేస్తున్నారని, ఇప్పటికే థియేటర్లకు వచ్చే వారి సంఖ్య తగ్గుతోందనీ, మరింత సహేతుకంగా ధరలను నిర్ణయించాలని, లేకపోతే హాళ్లు ఖాళీగా మారిపోతాయని ధర్మాసనం వ్యాఖ్యానించింది. బెంగళూరు (ఆంధ్రజ్యోతి)

## మన జీవితాలకు వర్తించేలా ఉంటుంది

'దసరా', 'దియా' చిత్రాలతో తెలుగులో మంచి గుర్తింపు తెచ్చుకున్న దీక్షిత్ శెట్టి నటించిన తాజా చిత్రం 'ద గర్ల్‌ఫ్రెండ్'. రష్మిక కథానాయికగా రాహుల్ రవీంద్రన్ తెరకెక్కించారు. గీతా ఆర్ట్స్, ధీరజ్ మొగిలినేని ఎంటర్టైన్‌మెంట్స్ బేనర్లపై ధీరజ్ మొగిలినేని, విద్యా కొప్పినీడి నిర్మించారు. ఈ నెల 7న చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్ర విశేషాలను మీడియాతో ముచ్చటించారు దీక్షిత్ శెట్టి. 'దసరా' సినిమాలో నేను పోషించిన పాత్ర నచ్చి, 'ది గర్ల్‌ఫ్రెండ్'లో నటిస్తారా అని దర్శకుడు రాహుల్ రవీంద్రన్ అడిగారు. ఆయన చెప్పిన స్క్రిప్ట్ నచ్చి వెంటనే అంగీకరించాను. ఇందులో నా పాత్ర పేరు విక్రమ్. నా పాత్ర తీరుతెన్నులు ఎలా ఉంటాయి అనేది చాలా క్లియర్‌గా వివరించేవారు రాహుల్. నా పాత్రకు కొన్ని నెగెటివ్ షేడ్స్ ఉంటాయి. ఇప్పటిదాకా మనం చూసిన ప్రేమకథలన్నీ ఒక తరహాలోనే సాగుతుంటాయి. ప్రేమకథని మరో కోణంలో ఆవిష్కరించే చిత్రమిది. మనందరి జీవితాలకు వర్తించేలా సినిమా ఉంటుంది' అని తెలిపారు.


దీక్షిత్ శెట్టి

# ప్రముఖ ఆలయాల్లో భక్తుల భద్రత, సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి

## అన్నవరం, పిఠాపురం, సామర్లకోట ఆలయాల్లో ఏర్పాట్లపై నిరంతర పర్యవేక్షణ

### అధికారులు సమన్వయంతో పనిచేయాలి : డిప్యూటీ సీఎం పవన్ ఆదేశం



పిఠాపురం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పవిత్రమైన కార్తీక మాసంలో ఆలయాలకు భక్తుల రద్దీ పెరిగిన నేపథ్యంలో ప్రముఖ ఆలయాల్లో భక్తుల భద్రత, సౌకర్యాలపై అధికార యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించాలని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆదేశించారు. క్యూలైన్ల ఏర్పాటు, పారిశుధ్య నిర్వహణ, భద్రతాపరమైన అంశాలపై శ్రద్ధ వహించాలన్నారు. కాకినాడ జిల్లాలోని ప్రముఖ శైవక్షేత్రాలైన పిఠాపురం పాదగయ, సామర్లకోట కుమారరామ భీమేశ్వరస్వామి, అన్నవరం సత్యనారాయణస్వామి ఆలయంతో పాటు ఇతర ముఖ్య ఆలయాల్లో ఏర్పాట్లపై ఆయన సోమవారం కలెక్టర్ సగిలి షాన్‌మోహన్, ఎస్పీ బిందుమాధవ్, జిల్లా అధికారులతో మాట్లాడి పలు అంశాలపై సూచనలు ఇచ్చారు. కాశీబుగ్గ సంఘటన నేపథ్యంలో ఆలయాల వద్ద అటువంటివి జరగకుండా అన్ని ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. దేవాదాయ శాఖ ఆధీనంలోని దేవాలయాలతో పాటు ప్రైవేటు ఆలయాల్లో ఉన్న పరిస్థితులపై అధికారులు తక్షణం పరిశీలన జరిపి కలెక్టర్, ఎస్పీలకు నివేదిక అందజేయాలని ఆదేశించారు. అన్నిచోట్లా భక్తుల రద్దీ ఏ విధంగా ఉంటుందో పర్యవేక్షణ చేయాలన్నారు. బుధవారం కార్తీక పౌర్ణమి, ఇతర ముఖ్యమైన పర్వదినాలతో పాటు శని, ఆది, సోమవారాల్లో భక్తుల రద్దీ ఊహించని విధంగా ఉంటుందని తెలిపారు. దేవాదాయ, పోలీసు, రెవెన్యూ, పంచాయతీరాజ్, మున్సిపల్ శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా క్యూలైన్ల ఏర్పాట్లు ఉండాలని, సీసీ కెమెరాల ద్వారా నిరంతరం పర్యవేక్షించాలన్నారు. తాత్కాలిక టాయిలెట్లు, మరుగుదొడ్ల ఏర్పాటుతో పాటు చెత్తచెదారం పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు తొలగించాలని, పారిశుధ్య నిర్వహణపై ఆయా మున్సిపాలిటీలు, పంచాయతీలు బాధ్యత తీసుకోవాలని సూచించారు. రద్దీ సమయాల్లో ఆర్టీసీ బస్సులను అధికంగా నడపాలని, ప్రమాదాలు జరగకుండా ట్రాఫిక్ నియంత్రణపై పోలీసు శాఖ దృష్టి సారించాలన్నారు. ఆలయాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. ప్రముఖ క్షేత్రాలతో పాటు అన్ని ఆలయాలకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలని పవన్‌కల్యాణ్ స్పష్టం చేశారు.

# అన్నవరం...అప్రమత్తం!

- కాశీబుగ్గ ఘటన నేపథ్యంలో సత్యదేవుడి గిరిప్రదక్షిణపై ప్రభుత్వం దృష్టి
- రెండు లక్షలమంది వస్తారని అంచనా
- అన్నవరం దేవస్థానం అధికారులతో దేవదాయ కమిషనర్ వీడియో కాన్ఫరెన్స్
- గిరిప్రదక్షిణ జరిగే ప్రాంతమంతా పరిశీలించిన కాకినాడ జిల్లా ఎస్పీ



దేవదాయ కమిషనర్ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అన్నవరం దేవస్థానం అధికారులు

అన్నవరం నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి పర్వదినం పురస్కరించుకుని ఈనెల 5న సత్యదేవుడి గిరిప్రదక్షిణ నిర్వహణ, జాగ్రత్తలపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. ఇటీవల కాశీబుగ్గ ప్రమాద ఘటన నేపథ్యంలో అప్రమత్తతపై అన్నవరం దేవస్థానం అధికారులకు దేవదాయ శాఖ కమిషనర్ సోమవారం ఉదయం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సూచనలిచ్చారు. అలాగే డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆదేశాలతో కాకినాడ జిల్లా ఎస్పీ బిందుమాధవ్ గిరిప్రదక్షిణ జరిగే సుమారు 11 కిలోమీటర్ల దూరాన్ని, భక్తులకు కల్పించే ఏర్పాట్లను సోమవారం సాయంత్రం పరిశీలించారు. దేవదాయ కమిషనర్ వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ గిరిప్రదక్షిణకు సుమారు 2లక్షల మంది భక్తులు వస్తారని అంచనా ఉందని ఉదయం 8గంటలకు పల్లకీసేవ, మధ్యాహ్నం 2గంటలకు సత్యరథంతో గిరియాత్ర జరుగుతుందన్నారు. ఎక్కడా తోపులాటలకు ఆస్కారం లేకుండా రోప్‌పార్టీ ఉండాలని, 2 సమయాల్లో గిరిప్రదక్షిణ జరుగుతుందని విస్తృత ప్రచారం చేయాలని దేవదాయ కమిషనర్ రామచంద్రమోహన్ సూచించారు. భక్తులు ఎక్కడా వెయిటింగ్ లేకుండా నిరంతరాయంగా నడక కొనసాగేలా చేయాలని, ఒకేచోట భక్తజనం గుమికూడకుండా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

### అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు

ఇప్పటికే దేవదాయశాఖ ముగ్గురు ప్రత్యేక అధికారులకు బాధ్యతలు అప్పగించగా గిరిప్రదక్షిణ ఫెస్టివల్ అధికారిగా రీజనల్ జాయింట్ కమిషనర్ వి.త్రినాధరావును నియమించారు. గిరి ప్రదక్షిణ అనంతరం కార్తీకమాసం మిగిలిన పర్వదినాల్లో భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయలని సూచించారు. అనంతరం వీడియో కాన్ఫెరెన్సలో వెల్లడించిన అంశాలపై ఈవో సుబ్బారావు, ఛైర్మన్ రోహిత్ సిబ్బందితో సమావేశంలో వెల్లడించి కమిషనర్ ఆదేశాలకణుగుణంగా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ప్రధానంగా రూ.1500, 2000 వ్రతమండపాల వద్ద వెయిటింగ్ అధికంగా ఉంటుందని పరిస్థితులకు అనుగుణంగా వ్రతం టిక్కెట్ల విక్రయాలు చేపట్టాలని సూచించారు. కార్తీక పౌర్ణమి రోజున సుమారు 15వేల వ్రతాలు జరుగుతాయని అంచనా వేస్తూ ఏర్పాట్లు, సిబ్బంది ఉండాలని తెలిపారు.

### పోలీస్‌లు అప్రమత్తంగా ఉండాలి

డిప్యూటీ సీఎం ఆదేశాలతో కాకినాడ జిల్లా ఎస్పీ బిందుమాధవ్ సోమవారం సాయంత్రం గిరిప్రదక్షిణ జరిగే సుమారు 11 కిలోమీటర్ల దారిని పరిశీలించారు. స్టాల్స్ ఏర్పాటు, మహిళలకు తాత్కాలిక మరుగుదొడ్ల తదితర వివరాలను దేవస్థానం అధికారులు వివరించగా ఆయన పలు సూచనలు చేశారు. పోలీస్ యంత్రాంగం అంతా చాలా అప్రమత్తంగా బాధ్యతతో వ్యవహరించాలన్నారు. నిర్లక్ష్యం ప్రదర్శించకుండా పర్యవేక్షణ జరగాలని డీఎస్పీ, సీఐలకు సూచించారు. కార్తీకమాసం పూర్తయ్యే వరకు భక్తులు అధికంగా వచ్చే పర్వదినాల్లో భద్రతాచర్యలు, గస్తీ ముమ్మరంగా ఉండాలని సూచించారు.



గిరి ప్రదక్షిణ రోడ్డును పరిశీలిస్తున్న కాకినాడ ఎస్పీ, దేవస్థానం అధికారులు

# నేడు అంతర్వేదిలో మహాశాంతి హోమం

### 10వేల మంది భక్తులు వస్తారనే అంచనాతో ఏర్పాట్లు

అంతర్వేది/మలికిపురం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ నేపథ్యంలో రాజోలు నియోజకవర్గ ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా శ్రీలక్ష్మీనరసింహస్వామి అభయన్నిచ్చినందుకు నవనారసింహ క్షేత్రాల్లో ఒకటైన అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం ప్రాంగణం ఎదురుగా ఉన్న కల్యాణ షెడ్డులో మంగళవారం మహాశాంతి హోమాన్ని నిర్వహిస్తున్నట్టు ఆలయ సహాయ కమిషనర్ ఎంకేటీఎన్వీ ప్రసాద్ పేర్కొన్నారు. సుమారు పదివేలాది మంది భక్తులు ఈ హోమంలో పాల్గొంటారని, వారికి ప్రత్యేక అఖండ అన్నసమారాధన కూడా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు హోమం జరుగుతుందన్నారు. అలాగే మలికిపురం మండలం విశ్వేశ్వరాయపురంలో రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ విలేకర్లతో మాట్లాడుతూ భక్తుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా మొంథా పెను తుపాన్ ప్రభావం నుంచి రాజోలు దీవి ప్రజలను, ఆస్తులను కాపాడిన నరసింహస్వామికి నిర్వహించే మహాశాంతి హోమాన్ని రాజోలు దీవి ప్రజలంతా కలసి విజయవంతం చేద్దామని పిలుపునిచ్చారు. 10వేల మంది భక్తులు వస్తారనే అంచనాతో ఏర్పాట్లు చేస్తున్నామని, పూర్ణాహుతి కార్యక్రమం కూడా ఉంటుందన్నారు. భక్తుల కోసం పలు ప్రాంతాల నుంచి బస్సులు ఏర్పాటు చేసినట్టు ఆయన చెప్పారు.

# అండగా ఉంటాం అధైర్యపడొద్దు

### బాధిత బాలిక కుటుంబానికి రూ.5లక్షలు ఎక్స్‌గ్రేషియా : మంత్రి సుభాష్

ఐ.పోలవరం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): అత్యాచారానికి గురైన బాలిక కుటుంబానికి రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియాతో పాటు బాలిక తల్లికి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగం కల్పనకు మంత్రి వాసంశెట్టి సుభాష్‌హామీ ఇచ్చారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలంలో బాణాపురంలో బాలిక కుటుంబాన్ని మంత్రి సోమవారం పరామర్శించారు. బాలిక కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని, వైసీపీ మాయమాటలు నమ్మవద్దన్నారు. సంఘటన జరిగిన వెంటనే సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, హోంమంత్రి అనిత దృష్టికి తీసుకెళ్లామన్నారు. సీఎం వెంటనే బాధిత కుటుంబాన్ని పరామర్శించి అండగా ఉండాలని ఆదేశించారన్నారు. హోంమంత్రి అనిత వెంటనే ఎస్పీకి ఫోన్ చేసి నిందితుని అరెస్టు చేయాలని ఆదేశించినట్టు తెలిపారు. బాధిత కుటుంబానికి ఇళ్ల స్థలం కేటాయించి, ఇల్లు నిర్మించే ఏర్పాటు చేస్తామన్నారు. పిల్లల చదువు విషయంలో కూడా బాధ్యత తీసుకుంటామన్నారు. ఆ కుటుంబాన్ని ఎంపీ హరీష్‌మాధుర్, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్ పరామర్శించారు.

### ఫోన్‌లో హోంమంత్రి పరామర్శ

బాణాపురంలో అత్యాచారానికి గురైన బాలిక కుటుంబాన్ని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత సోమవారం ఫోన్‌లో పరామర్శించారు. బాలిక తల్లితో మాట్లాడి మనోనిబ్బరంతో ఉండాలని సూచించారు. నిందితుడిని చట్టపరంగా కఠినంగా శిక్షించి న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు.

# 'నిందితులను విడిచిపెట్టం'



కంచిపల్లి శ్రీనివాస్ కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న మంత్రి సుభాష్, ఎంపీ హరీష్

అమలాపురం రూరల్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మనిషి బతికుండగానే కిరాతకంగా నాలుక కోసి జుట్టు తొలగించడం అత్యంత హేయమైన చర్య అని వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం కొంకాపల్లిలోని మృతుడు కంచిపల్లి శ్రీనివాస్ భార్య దేవి, కుటుంబ సభ్యులను సోమవారం రాత్రి మంత్రి, ఎంపీ గంటి హరీష్ మాధుర్ పరామర్శించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ఫోన్ సంభాషణ ఆధారంగా మనిషిని బతికుండగానే అతి కిరాతకంగా హత్యచేసిన నిందితులను విడిచిపెట్టేదిలేదని హెచ్చరించారు. 60 రోజుల్లో బెయిల్ తీసుకుని బయటకు వద్దామనే పిచ్చిలో వాళ్లు ఉన్నారని, కానీ ఇక్కపై అటువంటి ఆటలు చెల్లవన్నారు. మర్డర్ ఫర్ గెయిన్ అని మరో బ్యాచ్ ఉందని, వాళ్లను కూడా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. హత్యచేసిన తరువాత బయటకు వచ్చి దండులు వేసి ఊరేగింపుగా తీసుకువస్తున్నారని అలా చేసిన వారిని విడిచిపెట్టేది లేదన్నారు. హత్య చేసిన నిందితులు కనీసం కూరగాయలు కోయడానికి కూడా భయపడేలా పోలీసులే చేస్తారని హెచ్చరించారు. హత్య చేసినవారు, వారికి సహకరించినవారు, అనుచరులను విడిచిపెట్టేది లేదని.. కోనసీమలో భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని ఎంపీ పేర్కొన్నారు. హత్యకు సంబంధించిన పోస్టుమార్టం నివేదిక అందాల్సి ఉందని పట్టణ సీఐ పి.వీరబాబు తెలిపారు.

# సముద్రపు నాచుతో సంపద

### సముద్రపు నాచు పెంపకానికి రాష్ట్రంలో మూడు జిల్లాలు ఎంపిక

### అమృతానంద విశ్వవిద్యాలయ ప్రొఫెషర్ అమృతానటరాజన్



సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెషర్ మోహన్

ఉప్పలగుప్తం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): సముద్రపు నాచు మానవాళికి ఆరోగ్యంతో పాటు సంపదను సమకూరుస్తుందని అమృతానంద విశ్వవిద్యాలయ ప్రొఫెషర్ అమృతానటరాజన్ అన్నారు. సముద్రపు నాచును ఆహారంగా తీసుకుంటున్న జపాను దేశస్థుల ఆయుష్షు పెరిగినట్టు నిరూపితమైందన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఉప్పలగుప్తం మండలం టి.చల్లపల్లి పంచాయతీ తీరగ్రామం వాసాలతిప్పలో సోమవారం రాష్ట్ర గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ(సెర్ప్)-డీఆర్‌డీఏ, మత్స్యశాఖ సంయుక్త ఆధ్వర్యంలో డ్వాక్రా సంఘాల మత్స్యకార మహిళలకు సముద్రపు నాచు పెంపకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నాచు పెంపకానికి రాష్ట్రంలో కోనసీమ, శ్రీకాకుళం, అనకాపల్లి జిల్లాలను ఎంపిక చేసినట్టు తెలిపారు. పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా సముద్రపు నాచు ఎలా పెంచాలన్న అంశంపై వివరణ ఇచ్చారు. మరో ప్రొఫెషర్ మోహన్ మాట్లాడుతూ విత్తిన తర్వాత కేవలం 45 రోజుల్లో ఏ ఎరువులు వాడక్కర్లేకుండా నాచు పెరుగుతుందన్నారు. ఇక కిలో విత్తనాలు నాటితే 5 కిలోల నాచు లభిస్తుందన్నారు. కిలో ధర రూ.20-25 మధ్య ఉంటుందన్నారు. ఔషధాలు, మినరల్స్, కాస్మోటిక్స్, పచ్చళ్ళు, చేపల మేతల తయారీలో సముద్రపు నాచును వినియోగిస్తారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఇసుకపట్ల జయమణీరఘుబాబు, ఆక్వా స్టేట్ డైరెక్టర్ దేశంశెట్టి వెంకటలక్ష్మీనారాయణ, టీడీపీ మండలాధ్యక్షుడు అరిగెల నానాజీ, తెలుగు యువత నియోజక వర్గ అధ్యక్షుడు గొలకోటి చిన్నా ఉన్నారు.

# ఇంటి నుంచి వెళ్లిపోయిన బాలిక

### తల్లిదండ్రులకు అప్పగింత

ప్రత్తిపాడు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): బాలిక మిస్సింగ్ కేసును 8గంటల్లో ప్రత్తిపాడు పోలీసులు చేధించారు. బాలికను తల్లిదండ్రులకు అప్పగించారు. వివరాలు ఇలా ఉన్నాయి. కాకినాడ జిల్లా ప్రత్తిపాడుకు చెందిన 14 ఏళ్ల బాలిక చదువు విషయంలో తల్లిదండ్రులు మందలించడంతో ఇంట్లోని సుమారు రూ.15లక్షల విలువైన బంగారం, రూ.50వేలు తీసుకుని ఆదివారం మధ్యాహ్నం వెళ్లిపోయింది. దీనిపై తల్లిదండ్రులు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్ఐ దర్యాప్తు చేపట్టారు. బాలిక ఆచూకీ కనుగొనేందుకు సీఐ బి.సూర్య అప్పారావు పర్యవేక్షణలో పలు బృందాలు గాలింపు చేపట్టాయి. సెల్‌ఫోన్ టెక్నాలజీ సహాయంతో ఎస్ఐ గాలింపు ముమ్మరం చేశారు. భీమవరం ప్రాంతంలో బాలిక ఉన్నట్లు గుర్తించారు. బాలికను బంగారం, నగదుతో సహా సురక్షితంగా తల్లిదండ్రులకు అప్పగించారు. దీంతో పోలీసుల్ని ఉన్నతాధికారులు అభినందించారు.

# పుష్కరఘాట్‌లో గుర్తుతెలియని మృతదేహం

అంబాజీపేట, నవంబరు 3(ఆంధ్రజ్యోతి: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం వాకలగరువు పుష్కరఘాట్‌లో సుమారు 35 ఏళ్ల గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. కాళ్లకు షూ ఉన్నట్టు స్థానికులు గుర్తించారు. కుడిచేతికి కనకదుర్గమ్మ బొమ్మతో ఎరుపు తాడు కట్టి ఉంది. ఎస్ఐ చిరంజీవి ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని బయటకు తీయించారు.

# రెండు టన్నుల రేషన్ బియ్యం పట్టివేత

సీతానగరం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం ముగ్గళ్ళ గ్రామం వద్ద వ్యాన్‌పై అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని ఎంఎస్‌వో నాగలక్ష్మి పట్టుకుని సీజ్ చేశారు. సోమవారం ముగ్గళ్ళ నుంచి కోరుకొండ వెళ్తున్న వ్యాన్‌ను నాగలక్ష్మి తనిఖీ చేయగా 2 టన్నుల రేషన్ బియ్యం ఉండడం గమనించి స్వాధీనం చేసుకున్నారు. స్థానిక విలేకర్లతో ఆమె మాట్లాడుతూ కోరుకొండ మండలం కాపవరానికి చెందిన తలారి వీరబాబు, వారా రత్నరాజు ఇనుగంటివారిపేటలో ఇళ్ల వద్ద బియ్యం కొనుగోలు చేశామని కోరుకొండ తీసుకెళ్తున్నామని తెలిపారన్నారు. రేష్ బియ్యంతో పాటుగా వ్యాన్‌ను స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించి వారిపై ఫిర్యాదు చేశామన్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ రామ్‌కుమార్ తెలిపారు.

# హత్య కేసులో వ్యక్తి అరెస్ట్

గండేపల్లి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): యువకుడి హత్య కేసులో వ్యక్తిని అరెస్ట్ చేసినట్టు జగ్గంపేట సీఐ వైఆర్ కె.శ్రీనివాస్ తెలిపారు. కాకినాడ జిల్లా గండేపల్లి మండలం యర్రంపాలెంలో గత నెల 31న రాత్రి బుంగ బాబ్జీ, విజ్జన చందు కొత్తగా నిర్మాణం జరుగుతున్న ఇంటి వద్ద ఫోన్‌లో పబ్జీ గేమ్ ఆడుకుంటుండగా కాకర చిన్నీ అనే వ్యక్తి వచ్చి మీరు వెళ్లిపోండి అనడంతో గొడవ జరిగింది. చిన్ని క్షణికావేశంలో బాబ్జీని కత్తితో మెడపై నరకగా పెద్దాపురం ప్రభుతాసుపత్రికి తీసుకెళ్తుండగా మరణించాడు. సోమవారం నిందితుడు కాకర చిన్నిను పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు ఆధ్వర్యంలో జగ్గంపేట సీఐ, కిర్లంపూడి ఎస్ఐ జి.సతీష్ అరెస్టు చేసి కోర్టులో ప్రవేశపెట్టగా 14 రోజుల రిమాండ్ విధించినట్టు తెలిపారు.

## 'నన్నయ'లో అంతర్ కళాశాలల

# రెజ్లింగ్ పోటీలు, ఎంపికలు



రెజ్లింగ్ పోటీలను ప్రారంభిస్తున్న వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో రెజ్లింగ్ పురుష, మహిళల అంతర్‌కళాశాలల పోటీలు, విశ్వవిద్యాలయం జట్టు ఎంపికలు సోమవారం నిర్వహించారు. ఈ పోటీలను వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ ప్రారంభించారు. విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాలల నుంచి 51 మంది పురుష, మహిళ క్రీడాకారులు పాల్గొన్నారు. మహిళల ఫ్రీస్టైల్ విధానంలో 50 నుంచి 76 కిలోల కేటగిరి వరకూ జరిగాయి. వారిలో ఉత్తమ ప్రతిభ కనబరచిన క్రీడాకారులను విశ్వవిద్యాలయం జట్టుగా ఎంపికచేసి ఈ నెల 27 నుంచి 30 వరకూ రాజస్థాన్‌లో కోటా విశ్వవిద్యాలయంలో జరిగే సౌత్ జోన్ పోటీలకు పంపుతారు. అలాగే రెజ్లింగ్ పురుషుల ఫ్రీస్టైల్ విధానంలో 57 కిలోల నుంచి 125 కిలోల వరకూ క్రీడాకారులు పాల్గొని సత్తాచాటారు. రెజ్లింగ్ గ్రీకో రోమన్ విధానంలో 55 కిలోలనుంచి 130 కిలోల కేటగిరి వరకూ క్రీడాకారులు పాల్గొని సత్తాచాటారు. ఉత్తమ ప్రతిభ కనబరచిన వారిని విశ్వవిద్యాలయ జట్టుగా ఎంపిక చేసి పంజాబ్‌లోని చండీగడ్ విశ్వవిద్యాలయంలో జరిగే సౌత్‌జోన్ పోటీలకు పంపుతారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కెవి.స్వామి, క్రీడాబోర్డు సహాయ కార్యదర్శి ఎంవివిఎస్.మూర్తి, కార్యనిర్వాహక ఛైర్మన్ డి.జ్యోతిర్మయి పరిశీలకులు నరసింహరాజు ఎంపిక కమిటీ సభ్యులు కె.కనకదుర్గ, ఏ.ధర్మేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## అంతర్‌జిల్లాల బాస్కెట్‌బాల్ పోటీలకు

# ఉమ్మడి జిల్లా జట్ల ఎంపిక



బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపికైన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జట్ల సభ్యులు

రామచంద్రపురం(ద్రాక్షారామ),నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్టణంలో ఈనెల 7 నుంచి 11వరకు జరుగనున్న ఏపీ అంతర్‌జిల్లాల బాస్కెట్‌బాల్ పోటీలకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బాలురు, బాలికల జట్లను ఎంపిక చేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం కృత్తివెంటి పేర్రాజు పంతులు క్రీడా ప్రాంగణంలో రామచంద్రపురం బాస్కెట్‌బాల్ అసోసియేషన్, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గత నెల 31 నుంచి ఈనెల 2వరకు గన్నమని భానుమతి మెమోరియల్ ఉమ్మడి జిల్లాల బాలురు, బాలికల బాస్కెట్ బాల్ పోటీలు జరిగాయి. బాలికల విభాగంలో రామచంద్రపురం ప్రథమస్థానం, పిఠాపురం ద్వితీయస్థానం, సీబీసీ రాజమండ్రి తృతీయస్థానం దక్కించుకున్నాయి. బాలుర విభాగంలో రామచంద్రపురం ప్రథమస్థానం, డీఎస్ఏ కాకినాడ ద్వితీయస్థానం, సీబీసీ రాజమండ్రి తృతీయస్థానం దక్కించుకున్నాయి. ఇందులో బాలురు, బాలికల జట్లు ఎంపిక చేశారు. జట్లను మంత్రి సుభాష్, ఏఎంసీ ఛైర్మన్ అక్కల రిష్వంత్‌రాయ్, ఎస్‌కెపిపి ట్రస్టు ఛైర్మన్ సలాదినాయుడుమాస్టారు, రాష్ట్ర బాస్కెట్ బాల్‌అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గన్నమని చక్రవర్తి, డా.చెలికాని రామారావు, డా.కోట వెంకటసతీష్‌కుమార్ అభినందించారు.

# రాష్ట్ర ఎస్టీ కమిషన్ ఛైర్మన్‌గా సోళ్ల బొజ్జిరెడ్డి



సోళ్ల బొజ్జిరెడ్డి



గొర్లె సునీత

రంపచోడవరం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎస్టీ కమిషన్ ఛైర్మన్‌గా రంపచోడవరం నియోజకవర్గానికి చెందిన గిరిజన ఉపాధ్యాయుడు, బీజేపీ సీనియర్ నాయకుడు సోళ్ల బొజ్జిరెడ్డిని ఆయనతో పాటు రంపచోడవరం నియోజకవర్గానికే చెందిన టీడీపీ మహిళా విభాగం రాష్ట్ర నాయకురాలు గొర్లె సునీతను సభ్యురాలిగా నియమిస్తూ ప్రభుత్వం జీవో.నెం.155 ద్వారా ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలో అత్యంత కీలకమైన ఎస్టీ కమిషన్ ఛైర్మన్ పదవి రంప నియోజకవర్గానికి చెందిన బీపేపీ గిరిజన నాయకుడికి దక్కడం విశేషం. సోళ్ల బొజ్జిరెడ్డి ఉపాధ్యాయ వృత్తిలో ఉంటూనే గిరిజన హక్కులు, గిరిజన ఉపాధ్యాయ హక్కుల కోసం ఉద్యమాలు సాగించిన చరిత్ర ఉంది. ఉద్యోగాన్ని కూడా వదిలేసి పార్టీ కోసం గిరిజన గ్రామాల్లో తిరుగుతూ ఎంతో ఉనికిని తెచ్చారు. ఈ పరంపరలోనే ఆయనకు బీజేపీ 2019లో ఎమ్మెల్యే టికెట్‌ను కూడా ఇచ్చింది.

### సభ్యురాలిగా గొర్లె సునీత

ఇక ఛైర్మన్‌ను ఎంపిక చేసిన నియోజకవర్గం నుంచే సభ్యురాలిని కూడా ఎంపిక చేయడం తెలుగుదేశం పార్టీకి ఉన్న నిబద్ధతతకు నిదర్శనం. గొర్లె సునీత మాజీ మంత్రి గొర్లె ప్రకాశరావు కుమార్తె. ఆమె స్వతహాగా ఏ పార్టీ మద్దతు లేకుండా నియోజకవర్గంలో తిరిగి, తర్వాత టీడీపీ సభ్యత్వం తీసుకుని పార్టీని బలోపేతం చేయడంలో తన వంతు కృషి చేశారు. 2019 నుంచి, 2024 ఎన్నికల వరకూ రంపచోడవరం టీడీపీ ఎమ్మెల్యే టికెట్ కోసం ప్రయత్నించారు. టికెట్ దక్కకపోయినా నిరాశ చెందకుండా పార్టీ కోసం నియోజకవర్గంలో సంచరిస్తూ కార్యకర్తలు, మండల నాయకుల సమస్యలపై స్పందించి తన వంతుగా కృషి చేస్తూ అందించిన సేవలను గుర్తించింది. దీంతో తొలుత జీసీసీ డైరెక్టర్ పదవిని ఇచ్చారు. అనంతర జరిగిన కసరత్తులో ఆమెను ఎస్టీ కమిషన్ సభ్యురాలిగా ఎంపిక చేశారు.

# ఇన్నోవేషన్ కాన్‌క్లేవ్‌కు 'నన్నయ' అధ్యాపకురాలు



ఇన్నోవేషన్ కాన్‌క్లేవ్‌కు హాజరైన సుష్మప్రియ

దివాన్‌చెరువు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): న్యూఢిల్లీలోని భారత్ మండపంలో జరుగుతున్న ఎమర్జింగ్ సైన్స్ టెక్నాలజీస్, ఇన్నోవేషన్ కాన్‌క్లేవ్ (ఈఎస్‌టీఐసీ-2025)కు తూర్పుగోదావరి జిల్లా ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఫిజిక్స్ అధ్యాపకురాలు వై.సుష్మప్రియ హాజరయ్యారు. శాస్త్ర,సాంకేతిక శాఖ ఆధ్వర్యంలో సీఎస్ఐఆర్, డీఏఐ, ఐసీఎంఆర్, డీఆర్‌డీవో విద్యామంత్రిత్వశాఖ అంతరిక్ష విభాగాల సహకారంతో సోమవారం నుంచి ప్రారంభమైన ఈ కార్యక్రమం ఈనెల 5 వరకూ జరుగుతుంది. ప్రధాని మోదీ విచ్చేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. సుష్మప్రియ యువశాస్త్ర సాంకేతిక నాయకుల విభాగంలో క్వాంటం సైన్స్ అండ్ టెక్నాలజీ, అడ్వాన్డ్ మెటీరియల్స్ అండ్ మ్యానుఫాక్చరింగ్ అంశాల్లో ఎంపికవ్వగా ఆమెను వీసీఆచార్య ప్రసన్నశ్రీ అభినందించారు.

# భీమవరం పీఎఫ్ ఆఫీస్‌కి అఖిత భారత స్థాయి అవార్డు

### ప్రాంతీయ కమిషనర్ వెంకటేశ్వర్లు



అవార్డు స్వీకరిస్తున్న ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్ వెంకటేశ్వర్లు

రాజమహేంద్రవరం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్‌వో) 73వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ప్రకటించిన పురస్కారాల్లో అఖిల భారత స్థాయిలో భీమవరం జిల్లా కార్యాలయానికి అవార్డు దక్కిందని ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్-2 వెంకటేశ్వర్లు కలువాయి తెలిపారు. ఈ అవార్డును భీమవరం జిల్లా కార్యాలయ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి డి.ఎలీషారావుతో కలిసి న్యూఢిల్లీలో ఈ నెల 1న జరిగిన వ్యవస్థాపక దినోత్సవ కార్యక్రమంలో కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి నుంచి అందుకోవడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఉద్యోగులను ఆయన అభినందించారు. 2022-23లో రాజమహేంద్రవరం ప్రాంతీయ కార్యాలయం ఉత్తమ పనితీరు కనబరిచిన కార్యాలయంగా ఎంపికైందని గుర్తుచేశారు. 2023-24 ఏడాదికి స్వచ్ఛత అవార్డుల్లో అఖిల భారత స్థాయిలో మొదటి స్థానంలో నిలిచామన్నారు. సిబ్బంది నిబద్ధత, మెరుగైన సేవలకు గుర్తింపు దక్కడం గర్వకారణమని వెంకటేశ్వర్లు పేర్కొన్నారు.

# 'పదోన్నతులకు వృత్తి నైపుణ్య శిక్షణలు అవసరం'

సామర్లకోట, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): పంచాయతీ రాజ్ శాఖలో పదోన్నతులు త్వరతగతిన వస్తున్నాయని ఆయా పోస్టుల్లో మరింత వృత్తినైపుణ్యం పెంపొందించుకునేందుకు నిష్ణాతులైన ఫ్యాకల్టీలతో శిక్షణ తరగతులు ఎంతో అవసరం అని కాకినాడ జిల్లా సామర్లకోట విస్తరణ శిక్షణా కేంద్ర ప్రిన్సిపాల్ కెఎన్వీ. ప్రసాదరావు పేర్కొన్నారు. కేంద్రం ఆవరణలో ఇటీవల డిప్యూటీ ఎంపీడీవోలుగా పదోన్నతులు పొందిన అధికారులకు 2 రోజుల శిక్షణ తరగతులు, జూనియర్ అసిస్టెంట్లకు 6 రోజుల శిక్షణ తరగతులను సోమవారం ప్రిన్సిపాల్ జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. పదోన్నతులు త్వరగా వస్తున్నందున ఎవరు ఎప్పుడు ఏ పాత్ర చేయాలన్నా సిద్ధంగా ఉండాలని ఇందుకు శిక్షణలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ జీ.రమణ, డీడీవో డి.శ్రీనివాసరావు, ఎంపీడీవో శర్మ, సుశీల తదితరులు ఉన్నారు.

### షష్ఠి మహోత్సవాల ఏర్పాట్లకు శ్రీకారం

గొల్లప్రోలురూరల్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి):మండలంలోని తాటిపర్తిలో ఉన్న వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో 88వ షష్ఠి మహోత్సవాల ఏర్పాట్లకు శ్రీకారంచుట్టారు. ఈనెల 26 నుంచి ఈ ఉత్సవాలకు సంబంధించి సోమవారం పందిరిరాట ముహూర్తం చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ కుంపట్ల సత్యనారాయణ, సత్యవతి దంపతులు ఈ పూజలో పాల్గొన్నారు.

# కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

# పాదగయకు పోటెత్తిన భక్తులు

● కుక్కుటేశుడికి ఏకాదశ రుద్రాభిషేకాలు ● అమ్మవార్లకు కుంకుమ పూజలు


తులసిమొక్కకు దీపారాధన చేస్తున్న భక్తులు

పిఠాపురం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): దక్షిణకాశీగా విరాజిల్లుతున్న పిఠాపురం పట్టణంలోని పాదగయ క్షేత్రానికి భక్తులు పోటెత్తారు. కార్తీకమాసం రెండో సోమవారం పూజలు, స్నానాలు ఆచరించేందుకు వచ్చే భక్తులతో పాదగయ పరిసర రహదారులన్నీ జనసంద్రంగా మారాయి. భక్తుల రాక తెల్లవారుజాము రెండు గంటలకు ప్రారంభమయి రాత్రి వరకూ కొనసాగింది. పాదగయ పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయస్వామి, రాజరాజేశ్వరీ దేవి, పురుహూతికా అమ్మవార్లను దర్శించుకొని పూజలు జరిపారు. రాజరాజేశ్వరీ సమేత ఉమాకుక్కుటేశ్వరస్వామికి పంచామృత మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. సాయంత్రం వరకూ ఉపవాసం ఉన్న మహిళలు ఆలయంలో దీపాలు వెలిగించి కార్తీక నోము ఆచరించారు. తులసి మొక్క వద్ద దీపాలు వెలిగించారు. రాజరాజేశ్వరదేవి, పురుహూతికా అమ్మవార్లకు కుంకుమార్చనలు జరిగాయి. ఆలయంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ ఈవో కాట్నం జగన్మోహన శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

**గొల్లప్రోలు(ఆంధ్రజ్యోతి):** గొల్లప్రోలు పట్టణంలోని ఆలయాలన్నీ కార్తీక సోమవారం సందర్భంగా భక్తులతో కిటకిటలాడాయి. శివాలయానికి భక్తులు పోటెత్తారు. ఉమారామలింగేశ్వరస్వామి దర్శనానికి బారు లు తీరారు. స్వామికి అభిషేకాలు జరిగాయి. ఆలయ ప్రాంగణంలో మహాన్నదాన ప్రసాద వితరణ జరిగింది. ఆలయకమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

### భక్తజనసంద్రమైన శివాలయాలు

**గొల్లప్రోలురూరల్,(ఆంధ్రజ్యోతి):** దుర్గాడ శివాలయ పరిసరాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. పంచాయతన సమేత ఉమారామలింగేశ్వరస్వామి ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. స్వామికి విశేష అలంకారం చేశారు. ఆలయ అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తులు పూజాది కార్యక్రమాలు జరిపించారు. చేబ్రోలు శివాలయంలో పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామిని దర్శించుకున్నారు.

### భీమేశ్వరాలయంలో కార్తీక పూజలు

**సామర్లకోట(ఆంధ్రజ్యోతి):** కార్తీకమాసం రెండో సోమవారం సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయంలో విశేష పూజలు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బళ్ళ నీలకంఠం ఆధ్వర్యంలో ఆలయ ధర్మకర్తలమండలి చైర్మన్ కంటే జగదీష్‌మోహన్, ధర్మకర్తలమండలి పర్యవేక్షణలో తెల్లవారుజామున ఆలయ పండితులు గోపూజలతో పూజలను ప్రారంభించారు. తొలి అభిషేకపూజలలో పండితులు సోమేశ్వరశర్మ, చెరుకూరి సుందరరామయ్య, రాజగోపాలశర్మ, అంజిబాబు, వెంకన్న, వినయ్ తదితరులు వేద మంత్రోచ్చారణల మధ్య పంచద్రవ్యాలతో అభిషేకించారు. అనంతరం విశేష పుష్పార్చన పూజలు నిర్వహించి నూతన పట్టువస్త్రాలతో స్వామివారిని అలంకరించి భక్తుల దర్శనాలకు అనుమతించారు. జిల్లా నలుమూలల నుంచీ అధికసంఖ్యలో భక్తులు తొలి అభిషేక పూజలకు హాజరయ్యారు. సాయంత్రం ఆలయ ధ్వజస్తంభంవద్ద ఆకాశదీప పూజలలోనూ, రాత్రికి ఆలయ ఆవరణలో జరిగిన జ్యోతిర్లింగార్చన పూజలో నూ భక్తులు పాల్గొని ప్రసాదాలు స్వీకరిం చారు. కోనసీమ అంబేడ్కర్ జిల్లా డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

### ఘనంగా కోటి దీపోత్సవం

**కరప(ఆంధ్రజ్యోతి):** మండల కేంద్రం కరపలో సోమవారం 21వ కార్తీక కోటి దీపోత్సవం ఘనంగా జరిగింది. స్థానిక దీపాల సంబరం కమిటీ ఆధ్వర్యంలో గతనెల 31వ తేదీ నుంచి ఈ దీపోత్సవ వేడుకలు అట్టహాసంగా జరిగాయి. నిత్యం భజన కాలక్షేపం, గీతాపారాయణం చేస్తూ కార్తీక దామోదరుడికి పూజాకార్యక్రమాలు నిర్వహించారు. సోమవారం రాత్రి నిర్వాహకులు ప్రత్యేక అరలతో ఏర్పాటుచేసిన ఆర్చ్‌లో ప్రమిదలను పేర్చి కోటిదీపాలను వెలిగించారు. ఈ సందర్భంగా భారీ బాణసంచా కాల్పులు, ఆర్కెస్ట్రా, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

### ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు విశేష స్పందన

కార్పొరేషన్(కాకినాడ), నవంబరు 3(ఆంధ్రజ్యోతి):కాకినాడ నగర పాలక సంస్థలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి అర్జీదారులు తరలివచ్చి తమ సమస్యలను పరిష్కారం కోరుతూ అధికారులకు అర్జీలు అందజేశారు. సోమవారం నగర పాలక సంస్థ కార్యాలయంలోని సమావేశహాల్లో జరిగిన ఈ కార్యక్రమంలో కమిషనర్ కె.టి సుధాకర్ పాల్గొని అర్జీదారుల నుంచి స్వయంగా ఫిర్యాదులను స్వీకరించారు. కమిషనర్ సుధాకర్ అర్జీలను సంబంధిత శాఖాధికారులకు అందజేసి, తక్షణమే పరిష్కరించాల్సిందిగా ఆదేశించారు. అంతకుముందు నిర్వహించిన డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమంలో నలుగురు పౌరులు ఫోన్ ద్వారా తమ సమస్యలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ కె.శ్రీనివాసరావు, ఎస్.ఈ.పి.వెంకట్రావు, డిసిపి కృష్ణరావు టిపిఆర్వో శైలజ, మేనేజర్ సీతారాం, అకౌంటెంట్ రామశాస్త్రి తదితర అధికారులు పాల్గొన్నారు.

### పిఠాపురం పీజీఆర్ఎస్‌లో 57 అర్జీలు

పిఠాపురం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పిఠాపురంలోని పాతబస్టాండు వద్ద గల పాడా కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ప్రజలు నుంచి 57 అర్జీలు అందాయి. ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులను సత్వరం పరిశీలించి పరిష్కరించాలని పాడా ప్రాజెక్టు డైరెక్టర్ ఎ.చైత్రవర్షిణి అధికారులను ఆదేశించారు. రెవెన్యూశాఖకు సంబంధించి 11 అర్జీలు, మునిసిపాలిటీకి 15, పోలీసుశాఖకి 6, పంచాయతీరాజ్ శాఖకు సంబంధించి 8, ఇతరాలు 14, ఆఫ్‌లైన్‌లో మూడు దరఖాస్తులు వచ్చాయి. పీజీఆర్ఎస్‌లో ఏపీడీ వసంతమాధవి, మూడు మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

### సామర్లకోటలో కాలువగట్టు ఆక్రమణపై రీ సర్వే చేయాలి

● కలెక్టరేట్లో అధికారులకు వినతి

కలెక్టరేట్ (కాకినాడ), నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): సామర్లకోటలో ప్రాచీన శ్రీ మాండవ్య నారాయణస్వామి ఆలయం పక్కనే ఉన్న నీటి పారుదలశాఖకు చెందిన కాలువగట్టు భూమి ఆక్రమణపై రీసర్వే చేయాలని సామర్లకోట రైతు బిక్కిన శ్రీరంగనాయకులు, నేతలు హరిబాబు, ఇతర రైతులు కాకినాడ కలెక్టరేట్‌లో అధికారులకు సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా శ్రీరంగనాయకులు మా ట్లాడుతూ నెలరోజుల క్రితమే నీటిపారుదలశాఖకు చెందిన 60 సెంట్లు భూమి రియల్ ఎస్టేట్ వ్యాపారులు కబ్జాచేశారని ఫిర్యాదు చేశామన్నారు. దీనిపైన నీటిపారుదలశాఖ అధికారులు చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఈనేపథ్యంలో ఈ కబ్జాపై పూర్తిస్థాయిలో రీసర్వే చేసి నీటి పారుదలశాఖ భూమిని కబ్జాదారుల నుంచి కాపాడాలని అధికారులకు వివరించారు.

### గుర్తు తెలియని మృతదేహం లభ్యం



కాకినాడక్రైం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం సోమవారం కాకినాడ టూటౌన్ పోలీసులకు లభ్యమైంది. వివరాలిలా ఉన్నాయి. కాకినాడ నూకాలమ్మమాన్యం సమీపంలోని కాల్వలో పడి సుమారు 55నుంచి 60 ఏళ్ల మధ్య వయస్కుడైన పురుషుడు మృతి చెందినట్లు స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న టూటౌన్ సీఐ మజ్జి అప్పలనాయుడు ఆ ప్రాంతానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం మృతుడి బంధువులు గుర్తించేందుకుగాను మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీలో భద్రపర్చారు. మృతుడి ఆచూకీ కోసం 9440796541, 08842379312లో సంప్రదించాలని సీఐ కోరారు.

### పార్కుల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని పునఃసమీక్షించుకోవాలి

కలెక్టరేట్ (కాకినాడ), నవంబరు 3(ఆంధ్రజ్యోతి): కాకినాడలో ఉన్న పార్కుల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని పునఃసమీక్షించుకోవాలని బీజేపీ నాయకులు గోడి వెంకట్, రవీంద్రనాథ్, శర్మలు కోరారు. ఈమేరకు సోమవారం కాకినాడ కలెక్టరేట్‌లో అధికారులకు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ కాకినాడలో మధ్యతరగతి ప్రజలు, సీనియర్ సిటిజన్లు అధికంగా నివసిస్తున్నారనీ, పార్కులను ప్రైవేటీకరణ చేస్తే పేదల కనీస వినోదాన్ని కూడా దూరం చేసిన వారు అవుతారన్నారు. అధికారులు ఈ నిర్ణయాన్ని పునఃసమీక్షించుకోవాలన్నారు. అలాగే సీని యర్ సిటిజన్లు ఉదయం, సాయంత్రం సమయాలలో వాకింగ్ చేస్తారని అలాంటి తరుణంలో ఇబ్బందులు ఉంటాయనిఅధికారుల దృష్టికి తీసుకొచ్చారు.

### గొల్లప్రోలులో 25 అడుగుల శివలింగం

గొల్లప్రోలు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు పట్టణంలోని గాంధీనగర్‌లో బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో 25 అడుగుల శివలింగాన్ని ఏర్పాటు చేశారు. మహాదివ్య శివలింగం, ద్వాదశ జ్యోతిర్లింగాలను భక్తులు దర్శించుకున్నారు. శివలింగాన్ని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ దర్శించుకుని పూజలు నిర్వహించారు. కార్తీక దీపాలు, విద్యుత్ దీపాలతో అలంకరించారు.

## తాగునీటి సమస్యకు తక్షణ చర్యలు: కమిషనర్

కార్పొరేషన్(కాకినాడ), నవంబరు 3(ఆంధ్రజ్యోతి): నగర ప్రజలకు తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా వాటిని వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని నగరపాలక సంస్థ కమిషనర్ కేటీ సుధాకర్ పిలుపునిచ్చారు. నగర ప్రజలకు సురక్షితమైన తాగునీటిని అందించేందుకు ఎప్పటికప్పుడు నీటి సాంద్రతను పరీక్షిస్తామని కమిషనర్ తెలిపారు. సోమవారం ఉదయం బాహ్య పర్యటనలో భాగంగా కమిషనర్ పారిశుధ్య పనులు పరిశీలించారు. రామారావుపేట ప్రాంతంలోని కులాయి ద్వారా తాగునీరు సరఫరానను పరిశీలించారు. తాగునీటి సాంద్రతను ల్యాబ్‌లోనే పరీక్షించి, అనంతరం విక్టోరియా వాటర్ వర్క్స్‌ను సందర్శించారు. అక్కడ ల్యాబ్‌లో నీటి నాణ్యత పరీక్షా రికార్డులను పరిశీలించి, అధికారుల పనితీరుపై సంతృప్తి వ్యక్తంచేశారు. వాటర్‌వర్క్స్ డి.ఇ.లక్ష్మీనారాయణతో పాటు ఇతర అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

**రోడ్డుపై చెత్త వేస్తే చర్యలు తప్పవు**

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించిన కమిషనర్ కేటీ సుధాకర్, 12వ, 14వ సర్కిల్ పరిధిలోని కర్ణంగారు సెంటర్, ఒంటిమామిడి సెంటర్ ప్రాంతాల్లో పారిశుద్య పనులను పరిశీలించారు. ఒంటిమామిడి జంక్షన్‌వద్ద హోటల్ యజమానులు, అపార్ట్‌మెంట్‌వాసులు చెత్తను రోడ్డు మీద వేస్తున్నారని పారిశుధ్య కార్మికులు కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన కమిషనర్, చెత్తను పారిశుధ్య కార్మికులకే ఇవ్వాలని, రోడ్డుపైవేస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రోడ్డుమీద చెత్త వేయడంపై సంబంధిత హోటల్ యజమానులు, అపార్ట్‌మెంట్‌వాసులకు నోటీసులు జారీచేయాలని అధికారులను ఆదేశించారు.

**అన్న క్యాంటీన్‌లో పరిశుభ్రతపై ఆగ్రహం**

కాకినాడలోని అన్నమఘాటీ సెంటర్‌వద్ద గల అన్న క్యాంటీన్‌ను కమిషనర్ కేటీ సుధాకర్ సందర్శించారు. క్యాంటీన్ హాలులో డైనింగ్ టేబుల్స్ దుమ్ముతో ఉండటం గమనించిన ఆయన, సిబ్బంది నిరక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. క్యాంటీన్ తెరిచే ముందు అన్ని టెబుల్స్ శుభ్రంగా ఉంచాలని సిబ్బందికి ఆదేశించారు.

## ఘనంగా వన్ హెల్త్ కార్యక్రమం

జీజీహెచ్(కాకినాడ) నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రంగరాయ వైద్య కళాశాల్లో ఐఏపీఎస్ఎంఐసీఎంఆర్‌ల సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం వన్ హెల్త్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ విష్ణువర్ధన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఆరోగ్యం వివిధ జీవ చరాలకు సంబంధించిన అంశమని అన్నారు. వాతావరణ మార్పులు, కోవిడ్ ఈ విషయాలను రుజువు చేసాయని చెప్పారు. యాంటిబైయోటిక్స్ వినియోగం తగ్గించాలని, ప్లాస్టిక్ వినియోగానికి స్వస్తి పలికి పరిసరాలను పరిరక్షించాలన్నారు. అడవులను నరికివేయడం వల్ల వివిధ రకాల జీవులు జనావాసాల్లోకి చొరబడి ప్రమాదాలకు కారణమౌతున్నాయన్నారు. కార్యక్రమంలో భాగంగా కమ్యూనిటీ మెడిసిన్ విభాగం ఆధ్వర్యంలో ర్యాలీలు, ప్రమాణాలు,సీ ఎంఈలు, క్విజ్‌లతో పాటు వివిధ విజ్ఞానదాయక కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో ఆలోచనాశక్తి వృద్ధి చెందుతుందని డాక్టర్ విష్ణువర్ధన్ అన్నారు. అనంతరం కళాశాల ఆవరణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాళ్ళు డాక్టర్ శశి, డాక్టర్ విజయశేఖర్, ఎస్‌పిఎం హెచ్‌వోడి డాక్టర్ సుజాత, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్‌లు సౌమ్య, తిరుమలరావు, నర్సింగ్ కాలేజ్ ప్రిన్సిపాల్ మునిరత్నమ్మ, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

### గోదావరి కాలువగట్లపై బాంబు సా తుల్డా మొక్కల పెంపకానికి చర్యలు

కొత్తపల్లి,నవంబరు 3(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం కొణిదెల పవన్‌కళ్యాణ్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గ్రేట్ గ్రీన్ వాల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా కాలువగట్లపై బాంబు సా తుల్డా అనే అరుదైన వెదురుజాతి పెంపకానికి చర్యలు చేపట్టినట్లు గోదావరి తూర్పు డెల్టా చైర్మన్ మురాలశెట్టి సునీల్‌కుమార్ తెలిపారు. ఈమేరకు రాజమ హేంద్రవరంలో డీఎఫ్‌వో శ్రీనివాస్‌ను సోమవారం కలిసి ప్రాజెక్టులో భాగ మైన కెనాల్ బండ్ ప్లాంటింగ్‌పై చర్చించినట్లు తెలిపారు. కార్యక్రమంలో తూర్పుడెల్టా ప్రాజెక్టు వైస్‌చైర్మన్ తమలంపూడి సుధాకర్‌రెడ్డి,పలువురు అటవీశాఖ అధికారులు పాల్గొన్నట్లు ఆయన తెలిపారు.

### మొంథా తుఫాన్ బాధిత కుటుంబాలకు బియ్యం పంపిణీ

కొత్తపల్లి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ఇటీవల సంభవించిన మొంథా తుఫాన్ కారణంగా ఉపాధి కోల్పోయిన ఉప్పాడ తీరప్రాంత మత్స్యకార కుటుంబాలకు భారతచైతన్య యువజనపార్టీ(బీసీవైపీ) ఆధ్వర్యంలో సోమవారం బియ్యం పంపిణీ చేశారు. బీసీవైపీ అధ్యక్షుడు బోడే రామ చంద్రయాదవ్ ఆదేశాల మేరకు సుమారు 100 మత్స్యకారుల కుటు ంబాలకు 25కిలోల బియ్యం మూటలను పంపిణీ చేశారు. ఉపాధిలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న మత్స్యకారుల ఇబ్బందులను గుర్తించి తక్షణసాయం కింద బియ్యాన్ని పంపిణీ చేసిన బీసీవైపీ అధ్యక్షులు రామచంద్రయాదవ్‌ను మత్స్యకార ప్రతినిధులు అభినందనలు తెలిపారు. బీసీవైపీ రాష్ట్ర కన్వీనర్ శీరం శ్రీను, రాష్ట్ర నాయకులు అత్తిలి రాజు, గింజాల రాజు, గింజాల రావకృష్ణ, ఎం.శివ, ఎ.శ్రీను, పి.రాజా, ఎం సింహాద్రి అప్పన్న, ఈసారపు వీరబాబు తదితర కొత్తపల్లి మండల బీసీవైపీ నాయకులు పాల్గొన్నారు.

### 'విద్యార్థి దశలో సమయం ఎంతో విలువైనది'

కాకినాడ రూరల్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశలో సమయం ఎంతో విలువైనదని ఎక్కువ సమయం చదువుపై దృష్టి పెట్టాలని భాష్యం విద్యాసంస్థల చైర్మన్ బి.రామకృష్ణ విద్యార్థులకు సూచించారు. కాకినాడ కాపు కళ్యాణ మండపంలో కాకినాడ జిల్లాలోని భాష్యం విద్యాసంస్థల్లో పదోతరగతి చదువుతున్న విద్యార్థులకు పదిపరీక్షలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులంతా గతేడాది పది ఫలితాల్లో 600 మార్కులు సాధించి రాష్ట్రంలో ప్రథమస్థానంలో నిలిచిన భాష్యం విద్యార్థిని యాళ్ల నేహాంజనిని ఆదర్శంగా తీసుకుని ఉత్తమ మార్కులు సాధించేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం భాష్యం డైరెక్టర్ సాకేత్‌రామ్ మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి విద్యలో ఉన్నతంగా రాణించి సమాజంలోని కొంత మందికి ఉపాధిని కల్పించే ఎంటర్‌ప్రెన్యూరర్‌గా మారాలన్నారు. కార్యక్రమంలో భాష్యం విద్యాసంస్థల ప్రధాన సలహాదారుడు మైఖేల్‌రాజు, జోనల్ ఇన్‌ఛార్జ్‌లు వి.గోవిందరాజులు, అంజనేయులు, 11 శాఖల ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

### పాడి పరిశ్రమ రైతుల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం

సర్పవరంజంక్షన్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను ప్రభా వంతో వరిపంటకు నష్టం వాటిల్లడంతో పశుగ్రాసం కొరత రాకుండా పశు సంరక్షణ కోసం ప్రభుత్వం ఉచితంగా పశువుల దాణాను అందిస్తున్నట్లు ఎమ్మెల్యే పంతం నానాజీ తెలిపారు. సోమవారం సాయంత్రం వాకలపూడిలో పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో మొంథా తుఫాను సహాయ కార్యక్ర మంలో భాగంగా వాకలపూడి, నేమాం, సూర్యారావుపేట, పోలవరం గ్రామాలకు చెందిన 430 మంది పాడిరైతులకు పాడిపశువుల పశుగ్రాసం కింద పశువుల దాణా బస్తాలను టీడీపీ, బీజేపీ నాయకులు పెంకే శ్రీనివాసబాబా, రంబాల వెంకటేశ్వరరావులతో కలసి రైతులకు అందించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ముద్రగడ రమేష్, ఎంపీడీవో పసుపులేటి సతీష్, గ్రామ కార్యదర్శి పిడుగు పాండురంగారావు, కూటమి నాయకులు గంటా ప్రసాద్, గేదెల చిన్నారావు, మాతా లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

### కాంగ్రెస్ కార్యాలయంలో వన సమారాధన

కాకినాడ సిటీ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తలే కాంగ్రెస్ పార్టీకి బలమని కేంద్ర, రాష్ట్రాలలో కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు, కేంద్ర మాజీ మంత్రి మల్లిపూడి మంగపతి పళ్లంరాజు పేర్కొన్నారు. సోమవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో నగర కాంగ్రెస్ అధ్యక్షుడు చెక్కా నూకరాజు అధ్యక్షతన కార్తీక వనసమారాధన జరిగింది. తొలుత కార్యకర్తల సమావేశంలో పళ్లంరాజు మాట్లాడారు. ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలన్నారు. అనంతరం జరిగిన వన సమారాధన కార్యక్రమంలో ఏఐసీసీ సభ్యుడు మల్లిపూడి రాంబాబు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మాదేపల్లి సత్యానందరావు, డీసీసీ ప్రధాన కార్యదర్శి దాట్ల గాంధీరాజు, పీసీసీ సభ్యులు పోలిశెట్టి శ్రీనివాసు, తదితరులు పాల్గొన్నారు.

## నిర్దేశిత ప్రాంతాల్లోనే సముద్ర స్నానాలు చేయాలి: సీఐ

సర్పవరంజంక్షన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం పురస్కరించుకుని సముద్ర స్నానాలు ఆచరించే భక్తులు నిర్దేశించిన ప్రాంతాల్లోనే స్నానాలు చేయాలని, ఇతర ప్రాంతాల్లో సముద్రంలోకి దిగడం, స్నానాలు చేయడం తగదని వాకలపూడి కోస్టల్ సెక్యూరిటీ మెరైన్ పోలీస్‌స్టేషన్ సీఐ టిరామ్మోహన్‌రెడ్డి కోరారు. సోమవారం కాకినాడ రూరల్ మండలం సూర్యారావుపేట, ఎన్టీఆర్ బీచ్, నేమాం, ఉప్పలంక తదితర సముద్ర తీర ప్రాంతాల్లో పర్యటించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మొంథా తుఫాను ప్రభావంతో సముద్ర తీర ప్రాంతం, సముద్రంలో ప్రమాదకర మైన గుంతలు ఏర్పడ్డాయ న్నారు. తెలియక సముద్రంలో దిగితే ప్రమాదం సంభవించే అవకాశాలు ఉన్నాయన్నారు. కార్తీక పౌర్ణమి పురస్కరించుకుని 5వ తేదీన అధికసంఖ్యలో భక్తులు సముద్రస్నానాలు చేసేందుకు, కార్తీక దీపాలకు పూజలు చేసేందుకు సముద్రతీరానికి వచ్చే భక్తుల భద్రత కోసం ప్రత్యేక భద్రతాఏర్పాట్లు చేశామన్నారు.

### 'పార్టీలకు అతీతంగా అభివృద్ధిలో భాగస్వాములు కావాలి'


జనసేన కండువాలువేసిన ఎమ్మెల్యే పంతం నానాజీ

సర్పవరంజంక్షన్, నవంబరు3(ఆంధ్ర జ్యోతి): ఎన్నికలు వరకే రాజకీయాలని, తర్వాత అంతా కలసి రాజకీయపార్టీలకు అతీతంగా గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే పంతం నానాజీ కోరారు. సోమవారం తిమ్మాపురంలో పార్టీ సీనియర్ నాయకుడు, వేణుగోపాలస్వామి ఆలయం మాజీ చైర్మన్ మాదారపు తాతాజీ ఆధ్వర్యంలో రేపాక గార్డెన్స్‌కు చెందిన వైసీపీ నాయకుడు సీహెచ్ రమణమూర్తి ఆధ్వర్యంలో 30మంది జనసేన పార్టీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే నానాజీ పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం తిమ్మాపురంలో ప్రభుత్వ కాలనీ పరిశీలించారు. డ్రైనేజీ, రోడ్డు సదుపాయం లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు కాలనీవాసులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. త్వరలో మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు మంజూరు చేస్తానని ఎమ్మెల్యే నానాజీ హామీఇచ్చారు.

### భావనారాయణ స్వామి భూముల సంరక్షణకు చర్యలు

సర్పవరం జంక్షన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): శ్రీరాజ్యలక్ష్మి సమేత భావనారాయణ స్వామికి చెందిన భూములు, ఆస్తుల సంరక్షణకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ఆర్.శ్రీనివాసరావు తెలిపారు. కాకినాడరూరల్ సర్పవరంనకు చెందిన భావనారాయణస్వామికి చెందిన సుమారు 5.52ఎకరాల భూమి విక్రయానికి సిద్ధంగా ఉన్నాయని, సంరక్షణకు చర్యలు తీసుకోవాలని కోరుతూ సర్పవరంనకు చెందిన నందా పాండు రంగడు ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో ఫిర్యా దు చేశారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్, దేవదాయ,ధర్మాదాయశాఖ ఉన్నతాధికారుల ఆదేశాలమేరకు ఆలయ ఈవో విచారణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శ్రీరాజ్యలక్ష్మి సమేత భావనారాయణస్వామి ఆలయానికి సామర్లకోట మండలం వల్లూరులో సర్వే నెంబర్ 75లో ఉన్న 1.99 ఎకరాల భూమి ఉందని, ఇది పదేళ్ల కిందట 24-9-2015లో ఈ భూమిని కొప్పిశెట్టి సత్యనారాయణ నుంచి సాంబమూర్తి కొనుగోలు చేసినట్లు తెలి సిందన్నారు. ఈభూమి ఫెయిర్ అడంగళ్, లింక్‌లు, రెవెన్యూ రికార్డుల ప్రకారం భావనారాయణస్వామికే చెందిందన్నారు. సదరు వ్యక్తికి దేవ దాయ,ధర్మాదాయశాఖ చట్టం 83ప్రకారం నోటీసు జారీ చేశామన్నారు. మామిళ్లదొడ్డిలో గల సర్వే నెంబర్లు 27/6, 25/4, 58/2 లో 3.53 ఎకరాల భూమి దేవస్థానం నౌకరీ కింద ఇద్దరు ఆలయ అర్చకులకు ఇచ్చినట్లు తెలిపారు. వీటిని అమ్ముకునే హక్కులేదని, ఫలసాయం మాత్రమే అనుభవించాల్సి ఉంటుందన్నారు. అర్చకులకు నోటీసు జారీ చేసి వివరణ తీసుకున్నానని, ఈ భూమిని విక్రయించలేదని చెప్పామన్నారు. క్షేత్రస్థాయిలోకెళ్లి ఖాళీగా ఉన్న సదరు భూమి వద్ద రక్షణ చర్యలుగా హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశామన్నారు. దేవదాయశాఖ భూములను తప్పుడు పత్రాలు సృష్టించి అక్రమ రిజిస్ట్రేషన్లు చేయించినా, క్రయ విక్రయాలు జరిపినా దేవదాయ,ధర్మాదాయ చట్టం ప్రకారం అవి చెల్లనేరవని తెలిపారు. భావనారాయణస్వామి భూములపై సర్వే నిర్వహిం చి, మొత్తం భూముల సంరక్షణకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

### పంటనష్టం నమోదు జాబితా ప్రదర్శన

కరప, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్‌తో మండలవ్యాప్తంగా పంటలు దెబ్బతిన్నాయని, ప్రభుత్వ ఆదేశాల మేరకు పంట నష్టాన్ని నమోదుచేశామని ఏవో ఇమ్మిడిశెట్టి సత్య తెలిపారు. క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్టపోయిన వివరాలను రైతులవారీగా నమోదుచేశామన్నారు. ఈ జాబితాలను ఆయా రైతుసేవాకేంద్రాల వద్ద ప్రదర్శించామన్నారు. రైతులు ఈ జాబితాలో తమ వివరాలు సక్రమంగా ఉన్నయా లేదా సరిచూసుకోవాలని సూచించారు. ఏమైనా తప్పిదాలుంటే తమకు తెలియజేయాలని విజ్ఞప్తిచేశారు. కరప రైతుసేవాకేంద్రం ఎదుట జాబితాను వీఏఏ సాయికృష్ణ ప్రదర్శించగా పలువురు రైతులు వారి వివరాలను సరిచూసుకున్నారు. కరప సొసైటీ చైర్మన్ సైనవరపు భవానీశంకర్, జనసేన రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బోగిరెడ్డి గంగాధర్, యాళ్ల పండు, పేకేటి దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

### అగ్నిప్రమాద బాధితురాలికి ప్రభుత్వం అండ : ఎమ్మెల్యే నల్లమిల్లి

పెదపూడి(కరప), నవంబరు 3(ఆంధ్రజ్యోతి): పెదపూడి మండలం ఏపీత్రయంలో సోమవారం ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పర్యటించి అగ్నిప్రమాదం జరిగిన ఇంటిని పరిశీలించి బాధితురాలిని పరామర్శించారు. ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసానిచ్చిన ఆయన స్థానిక టీడీపీ నాయకులు సమకూర్చిన రూ.2వేల నగదు, 25 కేజీల బియ్యాన్ని బాధితురాలికి అందజేశారు. పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### క్రికెట్ కప్ సంబరాల్లో ఎంపీ సతీష్‌బాబు

కాకినాడ సిటీ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మహిళల క్రికెట్ వరల్డ్ కప్ ఫైనల్లో భారతజట్టు విజయం సాధించడం పట్ల ముంబైలో జరిగిన సంబరాల్లో మంత్రి నారాలోకేష్‌తోపాటు ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి, రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు పాల్గొన్నారు. విజేత జట్టు మహిళా క్రికెట్ క్రీడాకారిణిలను ఎంపీ అభినందించారు.

### బాస్కెట్‌బాల్ పోటీల్లో పిఠాపురం జట్టుకు ద్వితీయస్థానం

పిఠాపురం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బాస్కెట్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో పిఠాపురం మహిళల జట్టు ద్వితీ య స్థానంలో నిలిచింది. రామచంద్రపురంలో జరిగిన పురుషుల, మహిళల పోటీల్లో ప్రతిభ కనబరచిన రెండవ స్థానంలో నిలవడంతో క్రీడాకారులను పిఠాపురం జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, పిఠాపురం బాస్కెట్‌బాల్‌ప్లేయర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ మొగలి కాశీవిశ్వనాథం, ఉమ్మడి జిల్లా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బొజ్జా మాణిక్యాలరావు(అయలు), సభ్యులు కొత్తెం సుందరకుమార్, లోవరాజు, అర్జున్, రెడ్డి, రాజారావు పాల్గొన్నారు.

## శాంతించిన ఏలేరు

● పెరిగిన ఇన్‌ఫ్లోస్

పిఠాపురం/గొల్లప్రోలు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఉధృతంగా ఉన్న ఏలేరు వరద శాంతిస్తోంది. అల్లూరి సీతారామరాజుజిల్లాలోని క్యాచ్‌మెంట్ ఏరియాలో పడుతున్న వర్షాలు తగ్గుముఖం పట్టినా ఇన్‌ఫ్లోస్ మాత్రం సోమవారం పెరిగాయి. సోమవారం ఏలేరు రిజర్వాయర్‌లోకి 2479 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండగా, దిగువకు 3,175 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. స్పిల్‌వే ద్వారా 2,400 క్యూసెక్కులు, డీసీఆర్ స్లూయిజ్ ద్వారా 600 క్యూసెక్కుల నీరు మాత్రమే విడుదలవుతుండటంతో వరద ఉధృతి గణనీయంగా తగ్గింది. పిఠాపురం, గొల్లప్రోలు ప్రాంతాల్లో కాలువలకు పడిన గండ్లు నుంచి నీరు ప్రవహిస్తుండటంతో ఇంకా పలుచోట్ల పొలాల్లో వరద నీరు కొనసాగుతోంది. నీటిని బయటకు పంపేందుకు వీలుగా పొలాల్లో నుంచి రైతులు బాటలు తీసుకునే పనిలో నిమగ్నమయ్యారు. ఆదివారంతో పోల్చుకుంటే సోమవారం ఇన్‌ఫ్లోస్ పెరిగినా అవి సాధారణ స్థాయిలోనే ఉండటంతో రైతులు ఊపిరి పీల్చుకుంటున్నారు.

### రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక

పెద్దాపురం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి):స్థానిక రామారావులో ఉన్న శ్రీ ప్రకాష్ సినపర్జీ పాఠశాల టేబుల్స్ టేన్నిస్ అకాడమీలో ఈనెల 5వ తేదీన టేబుల్ టెన్నిస్ కాకినాడ జిల్లా క్రీడాకారులకు అండర్ 15 మెన్/వుమెన్ విభాగాలలో జిల్లాస్థాయిలో జట్లను ఎంపిక చేయడం జరుగుతుందని పాఠశాల డైరెక్టర్ సిహెచ్ విజయ్ ప్రకాష్ తెలిపారు. కాకినాడ జిల్లాలో ఉన్న టెబుల్ టెన్నిస్ క్రీడాకారులు అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### ఫీల్డ్ అసిస్టెంట్ అక్రమాలపై కలెక్టర్‌కు ఫిర్యాదు

కరప, నవంబరు3(ఆంధ్రజ్యోతి): విజయరాయుడుపాలెం గ్రామ ఫీల్డ్‌అసిస్టెంట్‌గా పనిచేస్తున్న మాత స్వామి ఉపాధిహామీ పథకం పనుల్లో పలు అక్రమాలకు పాల్పడినట్లు గ్రామానికి చెందిన పలువురు సోమవారం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదుచేశారు. ఈ సందర్భంగా ఫిర్యాదుదారులు మాత రాజశేఖర్, బూలా రాజు, మాదాసు వరప్రసాదరావులు మాట్లాడుతూ ఫీల్డ్‌అసిస్టెంట్ స్వామి తప్పుడు మస్తర్లు సృష్టించి వేతనాలను కాజేశాడని ఆరోపించారు. విదేశాల్లో ఉంటున్న గ్రామస్థులు నిమ్మగడ్డ కృష్ణ, బూలా రవీంద్రనాద్, దోణం పాప, పనికి అసలు వెళ్లనివారు, వైసీపీ నాయకులు, వలంటీర్లు, చివరకు గ్రామసర్పంచ్ జాబ్‌కార్డులపై దొంగమస్తర్లు వేసి అయినకాడికి దోచుకున్నాడని ఆరోపించారు. సమాచార హక్కు చట్టం ద్వారా సేకరించిన సమాచారంతో కలెక్టర్, ఎమ్మెల్యే, మండల అధికారులకు ఫిర్యాదుచేశామన్నారు. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి ఫీల్డ్‌అసిస్టెంట్ స్వామిని విధుల నుంచి తొలగించాలని, దుర్వినియోగమైన ప్రభుత్వ సొమ్మును రికవరీ చేయాలని వారు డిమాండ్ చేశారు. గ్రామస్తులు ఆర్‌వీవీ నాగేశ్వరరావు, బి.వెంకటేష్, పి.వీరబాబు, డి.సత్తిబాబు, ఫిర్యాదుచేసినవారిలో ఉన్నారు.

### సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

పిఠాపురం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆరోగ్య అవసరాల నిమిత్తం సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన చెకులను మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ అందజేశారు. పిఠాపురం, గొల్లప్రోలు పట్టణాలు, మండలాలు, కొత్తపల్లి మండలానికి చెందిన 52మందికి సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ.28లక్షలు మంజూరైనట్లు వర్మ తెలిపారు. బొజ్జా జగదీష్, సకుమళ్ల గంగాధర్, కొండేపూడి ప్రకాష్, గాది రాజబాబు, అనిశెట్టి సత్యానందరెడ్డి, కొరుప్రోలు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ వసతి గృహలను మెరుగుపరచండి

పెద్దాపురం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి):పట్టణ పరిధి ఎస్సీ సంక్షేమ వసతి గృహాలు శిథిలావస్థకు చేరుకున్నాయని వాటి స్థానంలో నూతన భవనాలను నిర్మించి, హాస్టల్ విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని జిల్లా మానవహక్కుల సంఘం నాయకుడు నూతలపాటి అప్పలకొండ ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రాన్ని సోమవారం అందజేశారు. వసతి గృహాలు శిథిలావస్థలో ఉండడం, టాయ్ లెట్లకు తలుపులు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమస్య పరిష్కారం చేసే దిశగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. జుత్తుక అప్పారావు పాల్గొన్నారు.

### మినర్వా విద్యార్థుల ఎంపిక

ప్రత్తిపాడు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి):రాష్ట్ర స్థాయి పోటీలకు మినర్వా విద్యార్థులు ఎంపిక అయినట్లు సోమవారం ఆ కళాశాల పీఈటీ రాజీవ్‌కుమార్ తెలిపారు. సోమవారం పెద్దాపురంలో జరిగిన అండర్ 17 ఆటల పోటీల్లో వారు ప్రతిభ కనబరిచి మంగళవారం జరగబోయే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. కబడ్డీలో రాజేష్, అవినాష్, సుషితలు షార్ట్‌పుట్‌లో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ తెలిపారు. ఎంపికైన విద్యార్థులను ఛైర్మన్‌మురళీకృష్ణ తదితరులు అభినందించారు.

# రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • రాజవొమ్మంగి • అడ్డతీగల • వై రామవరం • గంగవరం • దేవీపట్నం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

## అన్నవరం బ్రిడ్జి నిర్మించాలని ధర్నా

### కలెక్టర్ దినేష్‌కుమార్ హామీతో ధర్నా విరమించిన గ్రామస్తులు



వీఆర్‌పురం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మూడు నెలలుగా నానా అవస్థలు పడిన మండల ప్రజలు విసుగు చెంది సోమవారం అన్నవరం బ్రిడ్జి వద్ద ధర్నా నిర్వహించారు. ఎంపీడీవో ఇమ్మాలియన్, తహశీల్దార్ సరస్వతి, ఎస్ఐ సంతోష్‌కుమార్ అక్కడకు చేరుకుని ధర్నా విరమించాలని కోరినా ప్రజలు వినలేదు. ఉన్నతాధికారులు హామీ ఇస్తేనే ధర్నా విరమిస్తామని భీష్మించారు. అధికారులు విషయాన్ని కలెక్టర్ దినేష్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. ఈనెల 10న బ్రిడ్జి పనులు ప్రారంభిస్తామని కలెక్టర్ హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. కార్యక్రమంలో ఎంపీపీ కారం లక్ష్మి, సీపీఎం మండల కార్యదర్శి పులి సంతో ష్‌కుమార్, ఎంపీటీసీ పూనెం ప్రదీప్‌కుమార్ సర్పంచ్ పూనెం సరోజిని, వడ్లాది రమేష్, సున్నం రాజులు, పంకు సత్తిబాబు, మండల ప్రజలు, వైసీపీ నాయకుడు పిట్టా రామారావు తదితరులు పాల్గొన్నారు.

### శాశ్వత పట్టాలు మంజూరు చేయాలి

రంపచోడవరం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ఆదివాసీల సాగులో ఉన్న భూములకు శాశ్వత పట్టాలు మంజూరు చేయాలని అఖిలభారత రైతుకూలీ సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఐటీడీఏ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఏజెన్సీ ప్రాంతంలో బెల్ట్ షాపులు, నాటు సారా తయారీ, గంజాయిపై ఉక్కుపాదం మోపాలని కోరుతూ ఐటీడీఏ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. తొలుత మార్క్స్-ఏంగిల్స్ భవనం నుంచి ఐటీడీఏ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఏఐకేఎంఎస్ నాయకులు పల్లాల లచ్చిరెడ్డి, కుంజా దూలయ్య, కె.బాలురెడ్డి, పల్లాల అశోక్, ఐ.వీ.రమణ, కె.మురళీ, ధర్మారెడ్డి, సుగ్రీవుడు, పి.ఆదిలక్ష్మి, అన్నిక పండమ్మ, హ్యూమన్ రైట్స్ వాచ్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు బాలు అక్కిస పాల్గొన్నారు.

### పాఠశాలల్లో పారిశుధ్య పనులు నిర్వహించాలి

రంపచోడవరం, నవంబర్ 3(ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో పారిశుధ్య పనులు సక్రమంగా నిర్వహించాలని ఐటీడీఏ పీవో స్మరణ్ రాజ్ ఎంపీడీవోలను ఆదేశించారు. సోమవారం ఐటీడీఏ కార్యాలయంలో ఆయన డిప్యూటీ డైరెక్టర్ రుక్మాండయ్య, డీఈవో వై.మల్లేశ్వరరావు, ఏడీఎంహెచ్‌వో సరితలతో కలిసి సమావేశం, వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పాఠశాలల్లో దోమలు ప్రబలకుండా పాగింగ్ చేయాలన్నారు. ఎంపీడీవోలు ఎర్రంశెట్టి రాజు, సాల్మన్ రాజు, కుమార్, యాదగిరి ఈశ్వరరావు తదితరులు పాల్గొనారు.

### రాజవొమ్మంగి టీడీపీ మండలాధ్యక్షుడిగా పెద్దిరాజు

రాజవొమ్మంగి నవంబరు3(ఆంధ్రజ్యోతి): టీడీపీ మండలాధ్యక్షుడుగా గొల్లపూడి పెద్దిరాజును సోమవారం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి నియమించారు. రెండోసారి మండలాధ్యక్షుడుగా ఎన్నికయ్యారు. పెద్దిరాజు లబ్బర్తి ఎంపీటీసీగా ఉన్నారు. ఇటీవల ఇండస్ట్రీయల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డైరెక్టర్‌గా పెద్దిరాజును ప్రకటించారు. రంపచోడవరంలో రాజును ఎమ్మెల్యే సత్కరించారు.

### ఎటపాక టీడీపీ మండలాధ్యక్షుడిగా పుల్లయ్య



ఎటపాక, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): టీడీపీ మండలాధ్యక్షుడిగా బొల్లా పుల్లయ్య నియమితులయ్యారు. సోమవారం రంపచోడవరంలో ఎమ్మెల్యే శిరిషాదేవీ సమక్షంలో ప్రకటించారు. పలువురు టీడీపీ నేతలు, కార్యకర్తలకు పుల్లయ్యకు శుభాకాంక్షలు తెలియజేశారు.

### రెండు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

ఎటపాకనవంబరు 3(ఆంధ్రజ్యోతి): ఎటపాక మండలం రాష్ట్ర సరిహద్దులోని పురుషోత్తపట్నం గోదావరి నదీ ప్రాంతం నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను సోమవారం తెల్లవారుజామున రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. తహసీల్దార్ కారం సుబ్బారావు సిబ్బందితో గోదావరి నదీ ప్రాంతానికి వెళ్లి ఇసుక లోడ్‌తో రవాణా అవుతున్న ఓ ట్రాక్టర్‌ను పట్టుకోగా, మరో ట్రాక్టర్‌ను గోదావరి నదీ ఒడ్డును పట్టుకున్నారు. ఈట్రాక్టర్లను సీజ్ చేసి, పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్ల యజమానులు ఎటపాకకు చెందిన వారిగా తెలిసింది.





# జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

## కైలాసవాసా నమో నమః

### • భక్తులతో కిటకిటలాడిన శైవక్షేత్రాలు • శివనామస్మరణతో మార్మోగిన ఆలయాలు



ఏలేశ్వరం శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

అన్నవరం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రత్నగిరి వాసుడైన సత్యదేవుడి సన్నిధి కార్తీక సోమవారం సందర్భంగా రద్దీ నెలకొంది. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఒంటిగంట నుంచే వ్రతాలతో పాటు, రెండు గంటల నుంచి సర్వదర్శనాలు ప్రారంభించారు. సుమారు 6వేల మంది వ్రతమాచరించుకోగా పలు విభాగాల ద్వారా రూ.55 లక్షల ఆదాయం లభించింది. దళారుల నియంత్రణ చర్యలు సత్ఫలితాలు ఇస్తున్నాయి. తూర్పురాజగోపురం వద్ద భక్తులు ఎక్కువ మంది నిలబడకుండా ఉండేలా రావిచెట్టు దిగువన ఉన్న మెట్ల వద్ద రూ.200 టిక్కెట్లు ఉన్న భక్తులు మాత్రమే వెళ్లేందుకు చర్యలు తీసుకున్నారు.

ఏలేశ్వరం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం రెండో సోమవారాన్ని పురస్కరించుకొని ఆయా శైవక్షేత్రాలకు భక్తులు పోటెత్తారు. ఏలేశ్వరంలోని రామలింగేశ్వరస్వామి ఆలయంలో పురోహితులు కోడూరి మహేష్, యలమంచిలి శేఖర్, వెంకటేష్ అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. మండలంలోని లింగంపర్తి, సిరిపురం గ్రామాల్లో శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి.

రౌతులపూడి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): రౌతులపూడి, మేరక చామవరంలో గల శివాలయాలు కిటకిటలాడాయి. కార్తీక సోమవారం కావడంతో వేకువజాము నుంచే ఆయా ఆలయాల్లో పూజలు చేశారు. ఆలయ పూజారులు పంచామృతాలతో శివుడికి అభిషేకం చేశారు. ఆయా ఆలయాల్లో మహిళలు అరటి దొప్పల్లో కార్తీక దీపాలు వెలిగించారు.

### శివాలయాల్లో కార్తీక శోభ

తుని రూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కార్తీక సోమవారాన్ని పురస్కరించుకుని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తేటగుంట ఉమామహేశ్వర స్వామి, తునిలోని రామలింగేశ్వరస్వామి, తుని పట్టణ శివారు తాండవేశ్వర ఆలయాల్లో భక్తులు సందడి చేశారు. ఆధ్యాత్మిక పీఠం తపోవనంలో భక్తులు కిటకిటలాడారు. వేకువజామునే భక్తజనం పూజల్లో పాల్గొన్నారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

### అరుణాచలేశ్వరుడికి పూజలు

ప్రత్తిపాడు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాచపల్లి అరుణాచలేశ్వరునికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీక సోమవారాన్ని పురస్కరించుకుని స్వామివారికి సామూహిక పంచామృత, రుద్రాభిషేకాలు, లక్ష బిల్వార్చన నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకుడు రామానందస్వామి ఆధ్వర్యంలో వేద పండితులు అరుణాచలేశ్వరస్వామితోపాటు బసవేశ్వరుడికి అభిషేకాలు నిర్వహించారు. త్రయోదశి ప్రదోషకాలు, అష్టోత్తర సహస్రనామ అర్చన, పంచ హారతులు వంటి పలు పూజలు నిర్వహించారు.



షెడ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నెహ్రూ

### సేవా కార్యక్రమాలకు శ్రీకారం

జగ్గంపేట, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): కాట్రావులపల్లి గ్రామంలో జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ద్వారా మంగళవారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. టీడీపీ గ్రామ అధ్యక్షులు ముసిరెడ్డి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ పాల్గొన్నారు. తొలుత షిర్డీసాయి ఆలయంలో ప్రతి గురువారం అన్నదానం నిర్వహించడానికి ఫౌండేషన్ ద్వారా అన్నదానానికి షెడ్డు, భక్తులకు మరుగుదొడ్లు నిర్మించారు. అనంతరం పీ4 పథకంలో క్యాన్సర్ బారిన పడిన అనాధ దంపతులకు నిర్మించి ఇచ్చారు. ఫౌండేషన్ ద్వారా కనకదుర్గ ఆలయానికి స్టీల్ గ్రిల్స్ ఏర్పాటు చేసేందుకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పలు అంశాలపై మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్‌వీఎస్ అప్పలరాజు, జీను మణిబాబు, పోతుల మోహనరావు, కొత్త కొండబాబు, సుంకర సీతారామయ్య తదితరులతో పాటు కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

### బాధితుడిని పరామర్శించిన రమేష్

జగ్గంపేట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): నగర పేట గ్రామానికి చెందిన యువకుడు ఇటీవలే రోడ్డు ప్రమాదానికి గురై హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. సోమవారం జనసేన జగ్గంపేట ఇన్‌చార్జ్ తుమ్మలపల్లి రమేష్ ఆస్పత్రిలో బాధితుడిని కలిసి పరిస్థితిని తెలుసుకున్నారు.

### ఢిల్లీని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

తొండంగి నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 26న జరిగే ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జై భీమ్ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు తంతటి కిరణ్ కుమార్ అన్నారు. సోమవారం ఆయన శృంగవృక్షం గ్రామంలో ఛలో ఢిల్లీ కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను విడుదల చేసారు. ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద జరిగే కార్యక్రమంలో 13 డిమాండ్ల పై చర్చ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పి.సూర్యారావు, పిల్లి బాబ్జి, బండి చిట్టిబాబు, నేపా కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

### బృందగాన పోటీల్లో శ్రీ ప్రకాష్ విద్యార్థుల ప్రతిభ

తుని రూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): భారత్ వికాస్ పరిషత్ రీజనల్ పోటీల్లో ఈ ప్రకాష్ విద్యార్థులు ప్రథమస్థానంలో నిలిచారు. భారత్ వికాస్ పరిషత్ తిరుపతిలో నవంబరు 2న జరిగిన జానపద గీతాల పోటీల్లో ఎ.ప్రకాష్ విద్యార్థుల బృందం కె.లిన్ కల్లీ, ఎ.దేవి దీప్తిక, ఎస్. శ్రీలాస్య, ఎం.లక్ష్మినికిత, లాస్య త్రివేణి, ఎస్. సత్యశ్రీ అశ్విత, యు.లాస్య ప్రియ ప్రతిభ కనబరిచి సౌత్ రీజనల్ పోటీల్లో కర్ణాటక, తమిళనాడు, పాండిచ్చేరి, కేరళ, ఆంధ్రప్రదేశ్‌ల నుంచి పాల్గొన్న టీములతో పోటీ పడి తెలుగు జానపద గీతాలలో మొదటి స్థానం, హిందీ, సంస్కృతం పాటల పోటీల్లో ద్వితీయ స్థానం కైవసం చేసుకున్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను విద్యా సంస్థల అధినేత సీహెచ్‌కేవీ నరసింహారావు, సంయుక్త కార్యదర్శి సీహెచ్ విజయ్‌ప్రకాష్, సీనియర్ ప్రిన్సిపాల్ ఎంవీవీఎస్ మూర్తి, అకడమిక్ ఇన్‌చార్జ్ బి.ప్రసూన మౌళి తదితరులు పాల్గొన్నారు.

### నాయకుల చిత్రపటాలకు పాలాభిషేకం



కూనవరం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న పోలవరం పరిహారం కూటమి ప్రభుత్వం అందించడంతో మండలంలోని పోలవరం నిర్వాసితులు ప్రధానమంత్రి మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. టీడీపీమండల అధ్యక్షుడు ఎడవల్లి భాస్కరరావు, మాజీ ఎంపీపీ పోడియం అప్పా రావు, సర్పంచ్ బొల్లి లక్ష్మి, ఇంటి భాస్కరరావు, బొట్టు భాస్కర్, సోమక సత్యనారాయణ పాల్గొన్నారు.

### రైతులు అప్రమత్తంగా ఉండండి

దేవీపట్నం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలో వరి, అపరాలు పండించే రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయ అధికార వెంకటేశ్వర్లు తెలిపారు. వచ్చే రెండు, మూడు రోజులు వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపిందన్నారు. ఇప్పటికే కోతలు కోసినట్లయితే వాటిని సురక్షిత ప్రాంతాలకు తరలించి పంట ఉత్పత్తులను కాపాడుకోవాలన్నారు.

### పొల్లూరులో కార్తీకం పూజలు

మోతుగూడెం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): పొల్లూరులో శ్రీదుర్గా మల్లేశ్వర ఆలయంలో కార్తీక రెండో సోమవారం ఘనంగా నిర్వహించారు. ప్రధాన అర్చకుడు అయినవల్లి కుమార్‌స్వామి శర్మ ఆధ్వ ర్యంలో తెల్లవారుజాము నుంచి పంచామృతాలతో అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం ప్రెసిడెంట్ సతీష్ రాఘవ, కార్యదర్శి ఎం.శివరామకృష్ణ ట్రెజరర్ పేపకాయల శీను, రమేష్, గోవిందరాజులు, నాని పాల్గొన్నారు.

### ధాన్యం ఒబ్బిడిలో రైతులు నిమగ్నం



గండేపల్లి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఇటీవల తుఫాన్ కారణంగా కురిసిన భారీ వర్షాలకు పలు పంటలకు తీవ్ర నష్టం వచ్చిన సంగతి తెలిసిందే. రెండు రోజుల నుంచి రైతులు తడిసిన ధాన్యాన్ని రోడ్డుపక్కన ఆయా ఖాళీ స్థలాల్లో ఆరబెట్టుకుంటున్నారు. సోమవరం ఉదయం నుంచి కూడా ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నప్పటికి సాయంత్రం అయ్యేసరికి వాతావరణ మార్పులతో ఒక్కసారిగా ఆకాశం మేఘవృతంగా మారి వర్షం కురిసింది. వర్షం రావడంతో రైతులు ఏమి చేయాల్లో తెలిక చుట్టుపక్కల వారి సాయంతో ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకునే పనిలో పడ్డారు. ధాన్యం ఎండ బెట్టుకోవడానికి కూడా ఎడతెరిపి ఇవ్వట్లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు.

### కలెక్టర్ తనయుడి బారసాలకు ఎమ్మెల్యేలు



కలెక్టర్ తనయుడి బారసాలలో పాల్గొన్న ఎమ్మెల్యేలు

ప్రత్తిపాడు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ తనయుడు భైరవ్ బారసాల కాకినాడలో సోమవారం జరిగింది. బారసాల కార్యక్రమానికి అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ పేరాబత్తుల రామశేఖరంతో కలిసి ఎమ్మెల్యే సత్యప్రభ బారసాల కార్యక్రమంలో పాల్గొన్నారు. కలెక్టర్ తనయుడుకి భైరవ్‌గా నామకరణం చేయడంతో ఎమ్మెల్యే సత్యప్రభ చిన్నారి భైరవ్‌ను పిలుస్తూ మురిపించారు.

### అన్న క్యాంటీన్‌లో పేదలకు ఉచిత అన్నదానం

జగ్గంపేట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రోడ్డులోని ఎన్టీఆర్ స్మారక మందిరం వద్ద నాలుగు సంవత్సరాలుగా జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, టీడీపీ జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్‌కు ఈ వారం జగ్గంపేటకు చెందిన దివంగత డాక్టర్ గోలి సత్యకృష్ణ జ్ఞాపకార్థం ఆయన భార్య సూర్యకుమారి, కుటుంబ సభ్యుల ఆర్థిక సహాయంతో పేదలకు అన్నదానం నిర్వహించారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర టీడీపీ కార్యదర్శి ఎస్వీఎస్ అప్పలరాజు, జగ్గంపేట మండల టీడీపీ అధ్యక్షులు జీనుమణి బాబు హాజరై పేదలకు అన్నం వడ్డించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. త్వరలో జగ్గంపేటలో అన్న క్యాంటీన్ ఏర్పాటు అవుతుందని వక్తలు అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆర్యవైశ్య డైరెక్టర్ కొత్త కొండబాబు, దేవరపల్లి మూర్తి, టీడీపీ యువనేత పాలచర్ల నాగేంద్ర చౌదరి తదితరులు పాల్గొన్నారు.

### ఒకేషనల్ ఈఈటీ పోస్టుకు ఆహ్వానం

జగ్గంపేట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న ఒకేషనల్ ఈఈటీ అధ్యాపకుడి పోస్టుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. బీటెక్‌లో ఈసీఈలో 50 శాతం మార్కులు సాధించిన అభ్యర్థులు దీనికి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అభ్యర్థులు ఎనిమిదో తేదీలోగా కళాశాలలో దరఖాస్తులను సమర్పించాలన్నారు.

### 26న జరిగే సభను విజయవంతం చేయండి

రౌతులపూడి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ఈనెల 26న కాకినాడలో సూర్యకళామందిర్‌లో రాజ్యాంగ రక్షణ సమరభేరిని విజయవంతం చేయాలని బహుజన సమాజ్‌పార్టీ ప్రత్తిపాడు ఇన్‌చార్జ్ గునపర్తి అపురూప్ పిలుపునిచ్చారు. కాకినాడ జిల్లా కమిటీ అధ్వర్యంలో నవంబర్ 26 వ రాజ్యాంగ రక్షణ సమరభేరి సభను ఏర్పాటు చేశారన్నారు. సమరభేరి పోస్టర్‌నూ కాకినాడ జిల్లా బహుజన సమాజ్ పార్టీ అధ్యక్షులు మాత సుబ్రహ్మణ్యం అవిష్కరించారు. కార్యక్రమంలో సాధనాల రాజు, కొంగు రమేష్, తాతాజీ, చక్రరావు, నాగేశ్వరరావు, కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### పాపికొండలకు 31మంది పర్యాటకులు



దేవీపట్నం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): పాపికొండలు అందాలను తిలకించేందుకు తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి సోమవారం విహార యాత్రకు వచ్చారు. అమరావతి బోట్‌లో 31మంది పర్యాటకులు పోశమ్మ గండి వద్దనున్న బోట్ పాయింట్ నుంచి గోదావరి ముంపు పరివాహక ప్రాంతాల మీదుగా పాపికొండలు వెళ్లారు.

### మాధవ్‌ను కలిసిన ఎస్టీ కమిషన్ చైర్మన్ బొజ్జిరెడ్డి

రంపచోడవరం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌ను ఎస్టీ కమిషన్ చైర్మన్ సోళ్ల బొజ్జిరెడ్డి సోమవారం విజయవాడలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఎస్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు పాంగి రాజారావు పాల్గొన్నారు.

### ఎటపాక తహసీల్దార్‌గా శ్రీనివాసరావు

ఎటపాక,నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ఎటపాక తహసీల్దార్‌గా కె.శ్రీనివాసరావు నియమితులయ్యారు. సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన కారం సుబ్బారావు చింతూరు సబ్‌కలెక్టర్ కార్యాలయానికి బదిలీపై వెళ్లారు. శ్రీనివాసరావు కూనవరం నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు.

### మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు

రంపచోడవరం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): గిరిజన గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు పథకాలు ప్రవేశపెట్టాయని ఐటీడీఏ ఏపీవో(జీ) డీఎన్వీ రమణ అన్నారు. సోమవారం స్థానిక యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో బిర్సా ముండా 150వ పురస్కరించుకుని వివిధ శాఖల అధికారులు, సిబ్బందితో జయంత్యుత్సవాలు నిర్వహించారు. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు ఐ.శ్రీనివాసరావు, రవికుమార్, ఎంపీడీవోలు ఎర్రంశెట్టి రాజు, సాల్మన్ రాజు, కుమార్, యాదగిరి ఈశ్వరరావు, డీఈ చైతన్య, ఏపీడీలు టి.శ్రీనివాస్ విశ్వనాథ్, డేగలయ్య, సీడీపీవోలు, ఏపీఎంలు, స్వయం సహాయక సంఘాల మహిళలు పాల్గొన్నారు.

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గండేపల్లి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): బొర్రంపాలెం సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న మల్లేపల్లి గ్రామానికి మంగవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎలక్ట్రికల్ ఈఈ వీరభద్రరావు, గండేపల్లి ఏఈ కిరణ్ కిషోర్ తెలిపారు. వినియోగదారులు సిబ్బందికి సహకరించాలన్నారు.

### వైభవంగా కోటి దీపోత్సవం

ప్రత్తిపాడు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడులో సోమవారం రాత్రి కోటి దీపోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. వేదపండితులు తేజోమూర్తుల సుబ్రహ్మణ్య శర్మ, గురుభవాని పత్రి రమణల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు వెలుగుల నాని, ఎమ్మెల్యే అనుచరుడు అంబటి రాంబాబు దంపతులు పీటలపై కూర్చోనగా కోటి దీపోత్సవ ంలో 250 మంది జంటలు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్యప్రభ మాట్లాడుతూ కార్తీక సోమవారం నాడు కోటి దీపోత్సవాలు జరగడం సంతోషదాయకమని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఖాదీ బోర్డు డైరెక్టర్ కొమ్ముల కన్నబాబు, కూటమి నాయకులు యాళ్ల జగదీష్, రావూరి తాతాజీ, కోటి దీపోత్సవ ఉత్సవ కమిటీ సభ్యులు గానాల గంగాధర్, చిలకమర్తి వెంకట్రావు, పోలిశెట్టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### ప్రజావేదికకు అర్జీలు అందజేత

గండేపల్లి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా వేదికకు అర్జీలు నమోదైనట్లు ఎంపీడీవో సత్య రెడ్డి అన్నారు. నమోదైన అర్జీలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమం లో తహసీల్దార్ శ్రీనివాస్, రెండు మూడు శాఖల అధికారులు తప్ప మిగతా వాళ్ళంతా కూడా గైర్హాజరు అయ్యారు. ఇలాగైతే సమస్యలు పరిష్కారం అయ్యేది ఎలాగని పలువురు అర్జీదారులు బహిరంగంగా విమర్శిస్తున్నారు.